J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74

నెల్లూరు, 26.06.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 04 పేజీలు : 12, వెల : ₹ 5

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com




• రొచ్చు రాజకీయాలతో...

# రాజ్యాంగ వ్యవస్థలు రచ్చకెక్కుతున్నాయి



- పదవీ ఔన్నత్యాన్ని దిగజార్చిన నిమ్మగడ్డ
- బీజేపీ ముసుగులో టీడీపీ నేతల రాజకీయ వ్యభిచారం
- పార్క్ హయత్ సాక్షిగా అడ్డంగా దొరికిన నిమ్మగడ్డ, కామినేని, సుజనాచౌదరి
- వైకాపా ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర బట్టబయలు



స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండీ దేశవ్యాప్తంగా ఎన్నో రాజకీయ పార్టీలు అవతరించాయి, అంతరించాయి కూడా. అటు దేశంలోనూ ఇటు వివిధ రాష్ట్రాలలోనూ కొత్తపార్టీలు పుట్టుకొచ్చినప్పటికీ రాష్ట్రాలలో మాత్రమే ప్రాంతీయ పార్టీలు తమ ప్రభావాన్ని చూపగలిగాయి, ప్రాభవాన్ని ప్రదర్శించగలిగాయి.

అయితే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రాజకీయ క్రీడ చూస్తుంటే జుగుప్స కలుగుతోంది. 40 సంవత్సరాల అనుభవమని చెప్పుకుంటున్న పెద్దమనిషి.. ఒక ఐఏఎస్ అధికారిని అడ్డంపెట్టుకుని భారతీయ జనతా పార్టీలో వున్న తన రాజకీయ బ్రోకర్ల ద్వారా రాజ్యాంగ వ్యవస్థతో ఆడుకుంటున్న తీరు సిగ్గుచేటుగా వుంది. 40ఏళ్ళ యువ ముఖ్యమంత్రిని రాజకీయంగా ఎదుర్కోలేక ఇలా దొడ్డిదారి రాజకీయాలు చేయడం నీతిమాలిన విషయంగా కనిపిస్తోంది.

(మిగతా 11వ పేజీలో)

# మంత్రివర్గంలో మార్పులు?

> కొత్తగా ఇద్దరికి చోటు > రోజాకి అవకాశం? > పెద్దిరెడ్డికి రెవెన్యూ? > అనిల్‌యాదవ్‌కి డిప్యూటి సీఎం?

ఏపీలో ఇద్దరు కేబినెట్ మంత్రులు పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణలు రాజ్యసభకు ఎంపికైన నేపథ్యంలో వారి స్థానాల్లో కొత్త వారి ఎంపిక కోసం జోరుగా కసరత్తు సాగుతోంది. ఇద్దరూ బీసీ మంత్రులు కావడం, జగన్‌కు వీర విధేయులు కావడంతో వారి స్థానంలో వచ్చే వారు కూడా అదే సామాజికవర్గం వారే ఉండాలని కొందరు భావిస్తుండగా... బీసీలకు ఒకేసారి రెండు రాజ్యసభ సీట్లు ఇచ్చినందున మిగతా సామాజిక వర్గాలకు కూడా చోటివ్వాలనే డిమాండ్లు

(మిగతా 11వ పేజీలో)




• నవతరం నేత

## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా..

# ముక్కాల ద్వారక



**జిల్లాలో ఒక బలమైన సామజికవర్గం ఆర్యవైశ్య సామాజికవర్గం. ముఖ్యంగా నెల్లూరు నగరంలో ఈ సామాజిక వర్గానికి బలం, బలగం రెండూ ఎక్కువే. రాజకీయ నేతల గెలుపోటములను నిర్ణయించగలిగే స్థాయిలో ఈ సామాజికవర్గం రాజకీయాలను సైతం ప్రభావితం చేస్తుంది.**

తమ సామాజికవర్గానికి చెందిన పొట్టి శ్రీరాములు పేరును జిల్లాకు సాధించుకోగలిగారంటే వారి సత్తాకు, సమర్ధతకు ఇదే పెద్ద నిదర్శనం. అలాంటి సామాజికవర్గం అనాదిగా రాజకీయ నిరాదరణకు గురవుతూనే వస్తోంది. గెలుపోటములను ప్రభావితం చేయగలుగుతున్నారే తప్ప ప్రత్యక్ష రాజకీయాలలో వీళ్ళు ఉన్నత స్థానాలలో రాణించలేకపోతున్నారు. ఎప్పుడో 1956లో కోట వెంకటరంగం ప్రజాపార్టీ నుండి ఎంఎల్ఏ, ఎంపి స్థానాలకు పోటీచేసి ఓడిపోయినట్లు, ఆ తరువాత 60వ దశకంలో పేరూరి లక్ష్మణ గుప్త మునిసిపల్ వైస్‌ఛైర్మన్‌గా రెండుసార్లు, ఛైర్మన్‌గా ఒకసారి పనిచేసినట్లు, బ్రహ్మానందరెడ్డి కాంగ్రెస్ నుండి

(మిగతా 7వ పేజీలో)

# రైతు సంక్షేమమే.. ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**




రాష్ట్రంలో రైతుల సంక్షేమానికే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఈనెల 23న నాయుడు పేట మండలంలోని అన్నమేడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద 10 ఎంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ వ్యవసాయం ఒక పండుగలా చేసుకుని రైతాంగం కళకళలాడుతుండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రైతన్నలకు అనేక పథకాలతో చేయూతనిస్తున్నారని పేర్కొన్నారు. సిఎం సూచనల మేరకు విద్యుత్‌శాఖ వారు రైతులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారని చెప్పారు. సూళ్ళూరుపేట నియోజకవర్గం పరిధిలో 16,570కి పైగానే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, 31 విద్యుత్ సబ్‌స్టేషన్లలో 70 ఫీడర్లలో రైతులకు ఉచితంగా విద్యుత్‌ను అందజేస్తున్నారని తెలిపారు. తెలుగుగంగ నీటిని రెండో విడతగా పంటలకు సరఫరా చేసిన ఘనత వైకాపా ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు వగైరాలను నేరుగా రైతులకే అందజేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి ట్రేడ్‌యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, మహిళా జిల్లా కార్యదర్శి కురుగొండ ధనలక్ష్మి, అల్లూరు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి**



అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా అందజేస్తున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 23న ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో 4.61కోట్ల విలువైన అభివృద్ధిపనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కాకాణి మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో ఈ అయిదేళ్ళలో తాము పదిహేనేళ్ళ అభివృద్ధిని చేసి చూపిస్తామన్నారు. జులై 8వ తేదిన అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నివేశన పట్టా అందజేస్తామని, జన్మభూమి కమిటీల బాధ లేకుండా, రాజకీయాలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పరిస్థితి దిగజారిపోయిందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి నోటమాట రాక చంద్రబాబు అయోమయ స్థితిలో పడిపోయారన్నారు. సర్వేపల్లి టిడిపి ఇన్‌ఛార్జి కూడా స్థానిక పరిస్థితులను మరిచిపోయి, చైనాతో యుద్ధం చేస్తా మంటూ బయలుదేరాడని ఆయన మాజీ మంత్రి సోమిరెడ్డిని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. పార్టీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు నెల్లూరు శివప్రసాద్, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, రాగాల వెంకటేశ్వర్లు, కారంచేటి ప్రసాద శర్మ, బొనిగి ఆనందయ్య పాల్గొన్నారు.



## దేశ ప్రజల అభ్యున్నతి కోసమే

# ఇస్రో పనిచేస్తోంది

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశ ప్రజల అభ్యున్నతికి ఇస్రో అభివృద్ధి చేస్తోందని సంస్థ అధిపతి డాక్టర్ కైలాసవాడివో శివన్ అన్నారు. ఈనెల 24 న ఆయన ఇస్రోలోని అన్ని కేంద్రాల శాస్త్రవేత్తలు, ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇందులో సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ (షార్) ఉద్యోగులు పాల్గొన్నారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యంపై ఇస్రో ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇస్రో అభివృద్ధి చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశ్రమలకు అందించి, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తుందని, ఇస్రోలో ఇదేమి కొత్త కాదని ఎప్పటి నుంచో భారత పరిశ్రమల భాగస్వామ్యం ఉన్నట్లు తెలిపారు.

## కోట మండలంలో

# కేంద్రీయ విద్యాలయం

నెల్లూరు జిల్లా కోట మండలం గూడలి గ్రామంలో స్వర్ణముఖి నది సమీపంలో ఉన్న 10ఎకరాల ప్రభుత్వ భూముల్లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించిందని తహసీల్దార్ సీవీ మల్లిఖార్జునరావు ఈనెల 24న అధికారికంగా ప్రకటించారు. ఇక్కడ కేంద్రీయ విద్యాలయం ఏర్పాటైతే గూడలితో పాటు విద్యానగర్, చెందోడు పంచాయితీల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. విద్యాలయానికి సమీపంలో సుమారు 1200 ఎకరాలకు పైగా పట్టా భూములున్నాయి. ఆ భూములకు మంచి గిరాకీ రానుంది.

### ముఖ్యమంత్రి...

# అపాయింట్‌మెంట్లు మొదలయ్యాయి



2009 నుండి 2019 వరకు నిత్యం ప్రజలలో సంచరిస్తూ ప్రజల కష్టాలు కన్నీళ్ళు స్వయంగా చూసి 'నేను విన్నాను – నేను ఉన్నాను' అంటూ ప్రజల హృదయాలను దోచుకుని 151 సీట్ల ద్వారా ముఖ్యమంత్రి స్థానాన్ని తన కష్టంతో సాధించుకున్న యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్. గెలిచిన క్షణం నుండి తాను చెప్పిన మాటకి కట్టుబడి తాను ఇచ్చిన హామీలను నెరవేర్చడమే ధ్యేయంగా పని చేశాడు. నవరత్నాలు అమలుచేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ నిత్యం అధికారులతో సమీక్షలు చేస్తూ ప్రజలచేత మంచి మార్కులు వేయించుకునే దిశగా ఈ ఏడాది కాలం శ్రమించాడు.

ఈ క్రమంలో ఆయన ఎవ్వరికి అప్పాయింట్‌మెంట్లు ఇవ్వలేదు. సుదీర్ఘ అనుభవజ్ఞులైన రాజకీయ ఉద్దండులు కూర్చున్న ముఖ్యమంత్రి స్థానంలో అతి చిన్న వయస్సులో ఆ స్థానాన్ని అధిష్ఠించి ముందుగా పాలనా వ్యవస్థపై పట్టు సాధించడంలో నిమగ్నమయ్యాడు. ఈ ఏడాది కాలంలో ప్రభుత్వ విభాగాలపైనా, విధానాలపైనా పట్టు సాధించాడు. తన ఆలోచనల రథసారథులుగా తన ప్రభుత్వ యంత్రాంగాన్ని తయారు చేసుకున్నాడు. తమకు అపాయింట్‌మెంట్లు ఇవ్వడంలేదని సొంత పార్టీ ఎంపిలు, ఎంఎల్‌ఏలు అక్కడా ఇక్కడా చెవులు కొరుక్కున్నా ఆయన పట్టించుకోలేదు, ముందుగా ఎక్కడ ఏం జరుగుతుందో తాను తెలుసుకుంటేనే అందరికి న్యాయం చేయగలనని భావించి... ఆ విధంగానే ఏడాదిపాటు ప్రణాళిక రచించుకుని పాలనపైన పట్టు సాధించాడు.

ఇప్పుడు తలపులు తెరిచాడు, ఎవరికి ఏం కావాలో చెప్పండి అంటూ ఎంఎల్‌ఏలను, ఎంపిలను అడుగుతున్నాడు. రోజుకి 10మంది ప్రజాప్రతినిధులను కలువడం ప్రారంభించాడు, వై.యస్ తరహాలో త్వరలో ప్రజాదర్బార్ కూడా ప్రారంభించి ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుంటాడని పార్టీ వర్గాలు, అధికారులు చెప్తున్నారు. ఏడాది తర్వాత తమ నాయకుడు అపాయింట్‌మెంట్లు ఇవ్వడం ప్రారంభించడంతో వైసిపి శ్రేణుల ఆనందానికి అవధులు లేవు. శుభం, రాజన్న బిడ్డ తన నాన్న బాటలో నడిచి 30 సంవత్సరాలు ఆంధ్రులను పరిపాలించాలన్న దృఢమైన పట్టుదలతో, విశ్వాసంతో, నమ్మకంతో తన అడుగులు వేస్తున్నాడు. పైనున్న ఆ రాజన్నతో పాటు సకలదేవతలు ఆయనను ఆశీర్వదించాలని ఆశిద్దాం.



# రాజ్యసభకు మరో నలుగురు

- అటు రాజకీయం, విశ్వసనీయత
- ఇటు పారిశ్రామిక ప్రగతి, రాష్ట్ర భవిత
- సమ న్యాయం చేసిన జగన్

రాజ్యసభలో ఇప్పటికే ఇద్దరు సభ్యులున్న వైయస్సార్సీపీకి బలం పెరిగింది. ఇప్పుడు ఒకేసారిగా మరో నలుగురు రాజ్యసభ సభ్యులుగా ఎంపికయ్యారు. వీరితో మొత్తం సంఖ్య ఆరుకి చేరింది.

జూన్ 19న జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థులను నిర్ణయించడంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మరోసారి తన మేధస్సును, వ్యూహాన్ని ప్రదర్శించాడు.

ఎమ్మెల్సీలుగా వున్న మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్ చంద్రలను రాజ్యసభకు పంపి సమర్థవంతమైన రాజకీయాలపట్ల తనకున్న అవగాహనను కనపరుస్తూనే తనను నమ్మినవారికి తానెప్పుడూ అండగా ఉంటానన్న విశ్వసనీయతను కూడా చూపించాడు. వీరిద్దరికి రాజ్యసభ ఇవ్వడం ద్వారా వారి సామాజిక వర్గాలతో పాటు వారి నియోజకవర్గాలలో కూడా గట్టి పట్టును సాధించాడు.

ఇక వ్యాపార దిగ్గజాలైన మరో ఇద్దరు పరిమళ్ నత్వాని, అయోధ్య రామిరెడ్డిలను ఎంపిక చేయడంద్వారా అటు జాతీయ స్థాయిలోను, ఇటు రాష్ట్ర స్థాయిలోను రాష్ట్రానికి కలిగే ఆర్థిక ప్రయోజనాలను ఆయన దృష్టిలో పెట్టుకున్నాడన్నది చెప్పకనే చెప్పొచ్చు.

అటు వ్యక్తిగతంగా, రాజకీయ పరంగా న్యాయం జరిగేలా ఇద్దరినీ, ఇటు రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మరో ఇద్దరినీ ఎంపిక చేయడంతో జగన్ సమర్థత రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశమయ్యింది.

### పోరా... పోవే అంటున్న...

# కర్కశ ఖాకీ

**దాచేపల్లి సరిహద్దులో పోలీసు అధికారి వింత వైఖరి**



అసలే కరోనా, నాలుగు నెలలుగా ఒకటే కష్టాలు. బిడ్డలను చూడలేని తల్లి తండ్రులు, తల్లితండ్రుల్ని కలుసుకోలేని బిడ్డలు, భార్యకు దూరంగా భర్త, భర్తను చేరుకోలేని భార్య. అనారోగ్యంతో బాధ పడుతున్నవారు, ఉద్యోగరీత్యా చిక్కుకు పోయిన వారు, శుభకార్యాలకో, కర్మకృతువులకో వెళ్లి ఇరుక్కుపోయిన వారు, అత్యవసర ఆపరేషన్ కోసమో లేదా పెద్దాసుపత్రుల్లో వైద్యంకోసం పరుగులు తీసే వాళ్ళు, సెలవులకని వూరెళ్ళి బందీలైన వాళ్ళు... ఇలా రకరకాల మనుషులు ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికో, ఒక ఊరినుండి మరో ఊరికో ప్రయాణమై ఈ కరోనా ఎక్కడ అంటుకుంటుందో అనుకుంటూ భయపడుతూ పరుగులు పెడుతున్నారు. బరువైన గుండెలతో, మనోవేదనలతో, కరోనా కష్టాలతో సరిహద్దులు దాటుతున్నారు.

ఇలాంటి వారికీ కరోనాని మించిన కష్టాలు చూపిస్తున్నాడో పోలిసు అధికారి. ఎవరైనా అయన దగ్గరకు వెళ్లి తమ సమస్య చెప్పుకోబోతే వాళ్ళని అంటరానివాళ్లుగా చూస్తూ ఏయ్ పోరా... పోవే అంటూ నీచాతి నీచంగా కసురుతున్నాడీ కర్కశఖాకి.

వివరాల్లోకి వెళ్తే... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ఏ ప్రాంతంనుండి రావాలన్నా ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది. సరిహద్దు దాటాలంటే ఈ–పాస్ తీసుకోవాలి లేదా ప్రయాణానికి సరయిన కారణం చూపి నిబంధనల ప్రకారం ప్రభుత్వ అధికారుల వద్ద నమోదు చేయించుకుని అవసరమైన పరీక్షలు చేయించుకుని రాష్ట్రంలోకి ప్రవేశించాలి.

మీడియా వ్యక్తులకు మరికొన్ని అత్యవసర సేవలకు, ప్రోటోకాల్ వ్యక్తులకు ఈ నిబంధనలు వర్తించవు. అయితే వీరెవరైనా సరిహద్దు దాటేటప్పుడు అక్కడ ఇన్‌ఛార్జిగా వున్న డిఎస్‌పి స్థాయి అధికారికి సంబంధిత ఐడి కార్డు చూపడమో లేక సరైన కారణాన్ని వివరించడమో చెయ్యాలి. అయితే రాష్ట్రంలోకి ప్రవేశించే అన్ని సరిహద్దుల్లో పరిస్థితులు సక్రమంగానే వున్నాయి ఒక్క గుంటూరు జిల్లా దాచేపల్లి సరిహద్దు వద్ద రాష్ట్రంలోకి రావాలనుకునే వారికి మాత్రం కరోనా అక్కడే కనపడుతుంది.

ఇక్కడ వున్న పోలీస్ అధికారి తన వద్దకు వచ్చేవాళ్ళు ఎవరు, వాళ్ళు ఏ కారణం చెప్పబోతున్నారో కూడా వినడం లేదు. పురుషులనైతే ఏయ్ పోరా అని... మహిళలనైతే ఏయ్ పోవే అంటూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. జాలి, దయ, కరుణ లేకుండా సరిహద్దు దాటేవారిని దోషుల్లాగో, నేరస్తులలాగో చూస్తున్నాడు.

ఇటీవల సరిహద్దుకొచ్చిన ఒక మీడియా ప్రతినిధి మీ ఐ.జి కార్యాలయం నుండి లైన్లో వున్నారు మాట్లాడండి అని చెప్పబోతే... ఏయ్.. ఎవడు ఐ.జి... పో ముందు... అంటూ గాండ్రించి మరీ తరుముకున్నాడు. ప్రతిరోజూ ఇక్కడ ఇదే పరిస్థితి. 'చిన్ని కృష్ణుడు' లాగ తిష్ట వేసుకుని కూర్చుని సెల్‌ఫోన్‌లో ఆటలాడుకుంటూ వచ్చే ప్రతి ఒక్కరినీ మనోవేదనకు గురి చేస్తున్నాడీ ఘనుడు.

ఏఆర్ డిఎస్పీ స్థాయిలో ఉండి కనీస సహనం, ఓర్పు, మర్యాద లేని ఇలాంటి అధికారిని సరిహద్దులో పెట్టడమేంటని ప్రజలు వాపోతున్నారు. కరోనా వ్యాధికంటే కఠోరంగా వున్న ఈ అధికారి ప్రవర్తన చూసి విస్తుపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కలుగచేసుకుని ఇలాంటి కర్కశ ఖాకీని ఇక్కడనుండి తొలగించాలని కోరుతున్నారు.

### మాస్కు వేసుకుంటే...

# రిస్కు తక్కువే!



కరోనా ఎప్పుడు ఎక్కడ ఏ రూపంలో తగులుకుంటుందో అర్థం కావడంలేదు. మాకు వచ్చే అవకాశమే లేదనుకున్న వాళ్ళల్లో ఎక్కువగా ఈ వ్యాధి లక్షణాలు కనపడడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో 10వేల మందికిపైగా ఈ వైరస్ బారిన పడిన తరుణంలో ప్రజలు మరింత అప్రమత్తంగా వుండాలని ఆరోగ్య సంస్థలు, వైద్య బృందాలు హెచ్చరిస్తున్నాయి.

శానిటైజెర్లు వాడడం భౌతిక దూరం పాటించడంతో పాటు ఖచ్చితంగా మాస్కు ధరించాలని సూచిస్తున్నాయి. ఎక్కువ సమయం మాస్కు వేసుకున్న వారికి ఈ వైరస్ సోకే అవకాశాలు తక్కువే అంటున్నాయి.

ముఖ్యంగా నాలుగుగోడల మధ్య గదులలో వున్న సమయంలోనే మాస్కు ధరించడం అవసరం అని, చాలామంది బయటకు వెళ్ళినప్పుడుమాత్రమే మాస్కు వేసుకుని కార్యాలయానికో దుకాణానికో వెళ్ళగానే తీసేస్తున్నారని, ఒంటరిగా ప్రయాణం చేసేటప్పుడు అసలు మాస్కు అవసరం లేదని, ఈ వైరస్ గాలిద్వారా సోకె అవకాశం లేదు కాబట్టి ముఖ్యంగా ఎవరినైనా సంప్రదించినప్పుడు, కలిసినప్పుడు, ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు మాస్కు ఖచ్చితంగా వేసుకోవాలని వైద్యులు చెప్తున్నారు. తప్పనిసరిగా మాస్కు ధరిస్తే రిస్కు తక్కువే అన్నది వారి అభిప్రాయం. పాటించేద్దాం మరి!

# ప్రజలకు కరోనా నివారణ మందులు

ఆయుష్ మంత్రిత్వ శాఖ అందజేసిన కరోనా నివారణ మందులను సచివాలయాల ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తామని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ బాపిరెడ్డి తెలిపారు. ఆయుష్ శాఖ ఆర్డీ డాక్టర్ వెంకట్రామ్ నాయక్ ఈనెల 24 న కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి కరోనా నివారణకు హోమియో మందులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోమియో గుళికలను పెద్దలు మూడు రోజులపాటు ఆరు, చిన్నారులు నాలుగు వేసుకోవాలని తెలిపారు. వీటి ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. హోమియో డాక్టర్ శ్రీనివాస్, వైద్యాధికారి మాలకొండయ్య పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# యుద్ధం ఇద్దరికీ నష్టమే!

సరిహద్దులలో యుద్ధ వాతావరణం ఇంకా తగ్గలేదు. డ్రాగన్ కొట్టిన దొంగ దెబ్బ నుండి భారత్ తొందరగా కోలుకోవడమే కాదు, అమీతుమీ తేల్చుకుందామంటూ తొడ కొట్టింది. చైనాకు ధీటుగా భారత్ సరిహద్దుల్లో భారీగా దళాలను మోహరించింది. చైనాకు భయపడేది లేదని తేల్చిచెప్పింది. భారత భూభాగంలో నుండి అంగుళం కూడా వదులుకోమని స్పష్టం చేసింది.

భారతదేశం ఇక చైనాను నమ్మే పరిస్థితి లేదు. నమ్మిన ప్రతిసారీ వాళ్ళు దొంగదెబ్బలు కొడుతూనే వున్నారు. 1962 యుద్ధంలో అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేతగానితనం, అసమర్థత వల్ల భారతదేశంలో చైనా కొంత భూభాగాన్ని ఆక్రమించింది. అయినా కూడా ఆ దేశపు దాహం తీరలేదు. కమ్యూనిస్టు ముసుగులో సామ్రాజ్యవాద కాంక్షతో రగిలిపోతోంది. ఇప్పటికే టిబెట్, హాంకాంగ్‌లనూ ఆక్రమించిన చైనా భారతదేశంలోని అరుణాచల్ ప్రదేశ్, లద్దాక్, గాల్వాన్‌లను కూడా ఆక్రమించుకోవాలని ఎప్పటి నుండో ప్రణాళిక రచించింది. చైనాకు టిబెట్, హాంకాంగ్, లద్దాక్, గాల్వాన్, అరుణాచల్‌ప్రదేశ్‌లను ఐదు వేళ్ళుగా పేర్కొంటారు. ఈ ఐదువేళ్లను ఆక్రమించాలనేది చైనా కమ్యూనిస్టు నేత మావో కోరిక. దీని ప్రకారమే చైనా పావులు కదుపుతోంది. అరుణాచల్‌ప్రదేశ్ మీద ఎప్పటి నుండో పేచీకి దిగుతూనే వుంది. అరుణాచల్‌ప్రదేశ్‌ను తమ దేశంలో భూభాగంగా చూపిస్తూ ఆ దేశం మ్యాప్‌లు విడుదల చేస్తుంటుంది. ఇటీవల కాలంలో లద్దాక్, గాల్వాన్ లోయలలోనూ వివాదాలను, ఉద్రిక్తతలను పెంచిపోషిస్తోంది.

సరిహద్దుల్లో చర్చల ద్వారా శాంతిని నెలకొల్పాలని నిర్ణయించుకున్నాక కూడా చైనా ఆర్మీ గాల్వాన్ లోయలో భారత సైనికులపై దొంగదెబ్బకు పాల్పడిందంటే వారి ఉద్దేశ్యం భారత్‌తో మైత్రి కాదన్నది అర్థమవుతోంది. ఈ సంఘటన తర్వాత కూడా గాల్వాన్ లోయ మాదేనంటూ చైనా ప్రకటనలు ఇవ్వడం చూస్తున్నాం.

చైనాకు గట్టిగా జవాబు చెప్పే విషయంలో భారత ప్రభుత్వం అప్రమత్తంగానే వ్యవహరిస్తోందని చెప్పాలి. చైనాతో యుద్ధం అంటే వెనుకడుగేయడమో, శాంతి చర్చలంటూ చచ్చుబడిపోవడమో చేయలేదు. చైనా దళాలకు ధీటుగా సరిహద్దులలో సైనిక బలగాలను మోహరించింది. అత్యంత అధునాతన ఆయుధ సంపత్తిని బోర్డర్‌లో దించింది. సైనిక చర్య విషయంలో భారత బలగాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. చైనాతో గొడవల విషయంలో మెజార్టీ దేశాలు భారత్‌కే మద్దతు తెలిపాయి. ఓ పక్క కరోనా వైరస్ మూలంగా ప్రపంచ దేశాలన్నీ కూడా చైనాను ఒక దుష్టశక్తిగా చూస్తున్నాయి. ఈ పరంపరలోనే ఆ దేశం ఇలాంటి దురాగతాలకు పాల్పడితే, ప్రపంచం పూర్తిగా ఆ దేశాన్ని పక్కన పెడుతోంది.

భారత ప్రధాని నరేంద్ర మోడీ చైనా దుర్మార్గాన్ని ప్రపంచ దేశాల ముందు ఎండగట్టడంలో విజయం సాధించాడు. అదే సమయంలో జాతీయంగా అన్ని రాష్ట్రాల నుండి అన్ని పక్షాల మద్దతు కూడగట్టి ఈ విషయంలో జాతిని ఒక్క తాటిపైకి తెచ్చాడు. చైనాతో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశానికి దేశంలోని అన్ని రాజకీయ పక్షాల నేతలు హాజరు కావడం జరిగింది. చైనా ఆగడాలను అడ్డుకునే క్రమంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా తమ మద్దతు ఉంటుందని అన్ని జాతీయ, ప్రాంతీయ పక్షాలు తమ అభిప్రాయం వ్యక్తం చేయగా, వామపక్ష పార్టీలు మాత్రం తమ పార్టీ పైత్యాన్ని చాటుకున్నాయి. కాంగ్రెస్ మాత్రం తన సహజధోరణిలో దీనిని కూడా రాజకీయ కోణంలోనే చూసింది.

ఇప్పుడు సరిహద్దుల్లో ఇరు దేశాల మధ్య పరిస్థితి ఉద్రిక్తంగానే వుంది. యుద్ధం అన్నది భారత్ కోరుకోవడం లేదు. చైనావాళ్ళు గీరి పెట్టుకోవాలంటే వూరుకోవాలనుకోవడం కూడా లేదు. చైనా అంతగా యుద్ధ కాంక్షతో రగిలిపోతుంటే మనమూ చేతులు ముడుచుకోలేం కదా! కాని యుద్ధం వల్ల ఇరువైపులా నష్టం తప్పితే లాభం లేదు. ఇప్పుడు యుద్ధాలు అంటే కేవలం సైనికుల మరణాలు, ఆయుధాల వాడకాలకు పరిమితం కాదు, ఇరు దేశాలలోనూ ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలడం... ప్రజల జీవన పరిస్థితులు తలక్రిందులు కావడం... అభివృద్ధి పరంగా నిర్మించుకున్న సౌధాలన్నీ కూలిపోవడం... ఇటువంటివి జరగొచ్చు. చైనా నుండి మనకు కొన్ని దిగుమతులు ఆగిపోతే పలు రంగాలు దెబ్బతింటాయి. కొంతవరకు మన దేశ ఆర్థిక వ్యవస్థకూ నష్టమే! అదే సమయంలో చైనా ఒక పెద్ద మార్కెట్‌ను కోల్పోతుంది.

భారత్‌తో చైనా యుద్ధానికి దిగితే ఆ దేశంలోనే అంతర్యుద్ధం చెలరేగే అవకాశముంది. టిబెట్, హాంకాంగ్‌లలో సైతం తిరుగుబాట్లు రావచ్చు... భారత్, ఆస్ట్రేలియాలకు పట్టున్న జలరవాణా మార్గాలలో ఆ దేశపు నౌకలను స్థంభింపచేయవచ్చు... చైనా వస్తువులకు అతిపెద్ద మార్కెట్ అయిన భారత్‌లో చైనా వస్తువుల దిగుమతిని ఆపేయొచ్చు... ఇలా ఎన్నో అంశాలలో చూస్తే భారత్‌తో యుద్ధం చేయడమన్నది మనకన్నా కూడా చైనాకే ఎక్కువ నష్టం. కాబట్టి చైనా బుద్ధిగా, సమన్వయంతో వ్యవహరిస్తే రెండు దేశాలు కూడా ఇప్పుడున్న పంథాలో అభివృద్ధి పరంగా సవ్యంగా నడుస్తాయి.



**ఇప్పుడు సరిహద్దుల్లో ఇరు దేశాల మధ్య పరిస్థితి ఉద్రిక్తంగానే వుంది. యుద్ధం అన్నది భారత్ కోరుకోవడం లేదు. చైనావాళ్ళు గీరి పెట్టుకోవాలంటే వూరుకోవాలనుకోవడం కూడా లేదు. చైనా అంతగా యుద్ధ కాంక్షతో రగిలిపోతుంటే మనమూ చేతులు ముడుచుకోలేం కదా! కాని యుద్ధం వల్ల ఇరువైపులా నష్టం తప్పితే లాభం లేదు. ఇప్పుడు యుద్ధాలు అంటే కేవలం సైనికుల మరణాలు, ఆయుధాల వాడకాలకు పరిమితం కాదు, ఇరు దేశాలలోనూ ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలడం... ప్రజల జీవన పరిస్థితులు తలక్రిందులు కావడం... అభివృద్ధి పరంగా నిర్మించుకున్న సౌధాలన్నీ కూలిపోవడం జరగొచ్చు!**

# పెట్రోల్ ధరలు పెంచడం దారుణం

**- సిఐటియు, సిపిఐల ఆందోళన**

అసలే కరోనా మహమ్మారి, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో గత మూడునెలలుగా ప్రజలు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతుంటే కేంద్రప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచడం ప్రజలపై అదనపు భారం మోపినట్లేనంటూ ఈనెల 20న నెల్లూరులోని సిఐటియు, సిపిఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ రెండుపార్టీల ఆధ్వర్యంలో వేరువేరుచోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినా దేశంలో కేంద్రం పెట్రోల్ ధరలు పెంచడంవల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో కష్టమని వారు పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని అన్నమయ్య సర్కిల్, ముత్తుకూరు గేట్, అయ్యప్పగుడి, బుజబుజనెల్లూరు, డైకస్‌రోడ్డు, వనంతోపు సెంటర్ తదితర ప్రాంతాల్లో సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పెట్రోల్ ధరలు పెరగడం వల్ల రవాణా, విద్యుత్‌ఛార్జీలు మరింతగా పెరుగుతాయని, కేంద్రప్రభుత్వం వెంటనే పెట్రోల్ ధరలు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, అల్లాడిగోపాల్, సంపత్‌కుమార్, కృష్ణయ్య, సుధాకర్, లావణ్యకుమార్ జనార్ధన్ తదితరులు పాల్గొనగా, సిపిఐ నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో మునీర్‌తో పాటు, అరుణా కృపాకర్‌రావు, గంధం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై విజిలెన్స్ తనిఖీలు

నెల్లూరు జిల్లాలోని జాతీయ రహదారిపై ఈనెల 20,21 తేదీలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. చీమకుర్తి నుంచి కృష్ణపట్నం పోర్టుకు అధికలోడుతో వెళ్తున్న 6 గ్రానైట్ లారీలను, కృష్ణపట్నం పోర్టు నుండి చెన్నైకు అధికలోడుతో వెళ్తున్న 3 బొగ్గు లారీలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం రవాణాశాఖ అధికారులకు అప్పగించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు వి.సుధాకర్‌రెడ్డి, మాణిక్యాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిమెంట్ రోడ్లపై విచారణ..

నెల్లూరు నగరంలో గత ప్రభుత్వం నిర్మించిన సిమెంట్ రోడ్లపై విజిలెన్స్ శాఖ విచారణ చేపట్టింది. సిప్ నిధులతో నగరంలో జరిగిన సీసీ రోడ్ల నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో విజిలెన్స్ రోడ్ల నాణ్యతను పరిశీలించింది. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు. పనులు నాసిరకంగా జరిగినట్లు తేలితే ఇంజినీర్లు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

**కనువిందుగా..**

# రామలింగేశ్వరుని కల్యాణం

రామతీర్థంలో వెలసివున్న కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 20న స్వామివారి కల్యాణమహోత్సవ వేడుకను ఆలయ అర్చకులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి శోభాయమానంగా అలంకరించి కల్యాణోత్సవాన్ని కనువిందుగా జరిపారు. ఆలయ ఇ.ఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా**

# చంద్రశేఖర్

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) నెల్లూరు జోనల్ మేనేజర్(జడ్‌ఎం)గా చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఏపీఐఐసీ తిరుపతి డిప్యూటి జోనల్ మేనేజర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై నెల్లూరుకు వచ్చారు.

# వీఆర్ ఎస్సైలకు పోస్టింగులు

వీఆర్‌లో ఉన్న ముగ్గురు ఎస్సైలకు పోస్టింగులు కల్పిస్తూ జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ ఈనెల 20న ఉత్తర్వులు జారీ చేశారు. ఓజిలి ఎస్సైగా శేఖర్ బాబును, దిశ పోలీస్ స్టేషన్ ఎస్సైగా రంగస్వామిని, సీసీఎస్ ఎస్సైగా ఏడుకొండలును నియమించారు. ఓజిలి ఎస్సైగా పనిచేస్తున్న నరహరిని వీఆర్‌కు బదిలీ చేశారు.




# టెన్షన్ తగ్గించారు

పరీక్షలు వ్రాసి ప్రతిభ ద్వారా ఉత్తీర్ణులు అయ్యారన్నది మంచి మార్గం. ఇది అనుసరించాల్సిన విధానం కూడా! కాని పరిస్థితులు అనుకూలించక ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు నిర్వహించకుండానే అందరు విద్యార్థులను పాస్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది ఆహ్వానించదగ్గ పరిణామమే! ఎందుకంటే ఈ కరోనా విలయంలో తమ బిడ్డలను బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. అలాంటిది వారిని పరీక్షలకు పంపాలంటే ఇంకెంత భయంగా వుంటుందో.... ఏదేమైనా పదో తరగతి పరీక్షలను రద్దు చేయడం ద్వారా ముఖ్యమంత్రి మంచి నిర్ణయం తీసుకున్నారు.

**వాసిపల్లి సునీత, కోడూరు.**

# యాదవుల గుండెల్లో నిలిచిపోతారు

ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలలో సన్నిధి గొల్ల ఆచారాన్ని కొనసాగిస్తూ యాదవులకే శ్రీవారి తొలి దర్శన భాగ్యం దక్కేలా జి.ఓ చేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు. యాదవులంతా ఆయనకు ఋణపడి వుంటారు. మాజీముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో ఎంతో కుట్రపూరితంగా తరతరాలుగా వస్తున్న ఈ ఆచారాన్ని తొలగించారు. యాదవులను అవమానపరిచారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఆ ఆచారాన్ని పునరుద్ధరించడం హర్షణీయం.

**బైవబోయిన మురళి, నెల్లూరు.**

# వామపక్షాల తీరు దుర్మార్గం

చైనాతో సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ దేశంలో కొందరు కమ్యూనిస్టు నాయకులు, కమ్యూనిస్టు మేధావులు వ్యవహరిస్తున్న తీరు పరమదుర్మార్గంగా వుంటోంది. ఈ దేశంలో తిండి తింటూ వీళ్లంతా చైనా పాటలు పాడుతున్నారు. చైనాను గొప్ప దేశంగా కీర్తిస్తున్నారు. భారతదేశాన్ని చైనాకు తగ్గి వుండాలని సూచిస్తున్నారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టే ఇలాంటి దుర్మార్గులను ఏం చేసినా పాపం లేదు.

**సి.రాజీవి, నెల్లూరు.**



# విద్యార్థుల్లో వెల్లువెత్తుతున్న ఆనందం

- టెన్త్, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రద్దు
- అందరూ పాసైనట్లుగానే పరిగణించాలని ప్రభుత్వ నిర్ణయం

గత కొన్ని రోజులుగా పరీక్షలు జరుగుతాయో లేదోననే ఉత్కంఠతో ఉన్న విద్యార్థి లోకానికి ఎట్టకేలకు ఊరట కలిగింది. టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను ప్రభుత్వం రద్దు చేస్తున్నట్లు ఈనెల 20న ప్రకటించడంతో విద్యార్థుల్లో ఆనందం నెలకొంది. కరోనా నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్‌ను, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, పరీక్షలు లేకుండానే విద్యార్థులను పాస్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళనకు తెర పడింది. అదేవిధంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను కూడా రద్దు చేసింది. ఆ పరీక్షలకు హాజరు కావాల్సిన వారంతా పాసయినట్లుగా పరిగణించాలని ప్రభుత్వం పేర్కొనడంతో హాల్ టిక్కెట్లు పొందిన పది, ఇంటర్ విద్యార్థులంతా ఉత్తీర్ణులైనట్లుగానే పరిగణించనున్నారు. అంతర్గత మార్కుల ఆధారంగా టెన్త్ విద్యార్థులకు గ్రేడ్‌లు నిర్ణయిస్తారు.

కరోనా వైరస్ కారణంగా పాఠశాలలు నిర్వహించకపోవడంతో పునశ్చరణ తరగతులు లేక విద్యార్థులకు పరీక్షలు రాయడం ప్రశ్నార్థకంగా మారింది. పాఠ్యాంశాలపై వచ్చే సందేహాలను నివృత్తి చేసుకునేందుకు కూడా అవకాశం లేకపోవడంతో పరీక్షలు వస్తే ఏమి చేయాలో అర్థం కాని అయోమయ పరిస్థితి ఏర్పడింది. కరోనా మహమ్మారి వ్యాధి విజృంభిస్తున్న నేటి పరిస్థితుల్లో పరీక్షలకు ఎలా హాజరు కావాలోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వచ్చే నెలలో జరగాల్సిన ఈ పరీక్షలను ప్రభుత్వం రద్దుచేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఊరట చెందారు. టెన్త్ పరీక్షలను రద్దు చేయడంతో పరీక్షలు నిర్వహించాల్సిన జిల్లా యంత్రాంగం కూడా ఊపిరి పీల్చుకుంది. దీంతో పాటు డిగ్రీ, పీజీ, బీటెక్ పరీక్షలపై కూడా ప్రభుత్వం తర్జనభర్జనలు చేస్తోంది. ఈ పరీక్షలను నిర్వహించాలా.. వద్దా? అనే విషయంపై అందరి సలహాలు తీసుకుంటోంది. త్వరలోనే దీనిపై కూడా ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుని ప్రకటన చేయనున్నట్లు సమాచారం.

## 'ఆరోగ్యమే మహాభాగ్యం'గా...

# వెంటపడుతున్న 'వెంకటరమణ'

**- నెల్లూరీయుల ప్రశంసలందుకుంటున్న ఆరోగ్య అధికారి**



స్వచ్ఛత, పరిశుభ్రతతో పాటు ఆరోగ్యం పట్ల బాధ్యత... ఇదీ ప్రస్తుతం ప్రతీ చోటా వినిపిస్తున్న మాట... అందరూ ఆచరిస్తున్న బాట. ముఖ్యంగా నెల్లూరు నగరంలో కరోనా మహమ్మారి విజృంభిస్తున్న తరుణంలో అటు అధికారులు, ఇటు ప్రజలూ పై మూడు అంశాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు.



ఇలాంటి సందర్భాల్లో నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా పిలువబడే మన నెల్లూరు నగర కార్పొరేషన్‌కి ఇప్పుడొక నిఖార్సైన అధికారి వచ్చాడు. నగరంలో ఎప్పుడూ లేనంత విధంగా నిఘా నేత్రం పెట్టి నిల్వ అమ్మకాల నిగ్గు తేల్చడమే కాకుండా నిబంధనలకు నీళ్లు వదిలిన వాళ్ళనీ నిలదీస్తున్నాడు.

ఆయన పేరు పిడుగు వెంకటరమణ. నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ ఆరోగ్య అధికారి(హెల్త్ ఆఫీసర్)గా అయన బాధ్యతలు చేపట్టిననాటి నుండి ఆరోగ్య నెల్లూరుగా నగరాన్ని తీర్చిదిద్దడానికి ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నాడు. నిల్వ చేసిన కుళ్ళు మాంసాన్ని వందల కొద్దీ కిలోలు గుర్తించి పట్టుకున్నాడు, హోటళ్ళు, రెస్టారెంట్లలో ఫ్రీజర్లలో దాచిపెట్టిన ఆహార పదార్థాలను బయటకి తీసి, వాటి యాజమాన్యానికి గట్టి వార్నింగే ఇస్తున్నాడు. ఇక పండ్ల దుకాణాలను, బేకరీలను చిన్నచిన్న టీ, కాఫీ స్టాళ్ళను కూడా ఆయన వదిలిపెట్టడం లేదు. ఇప్పటికే నిల్వ ఉంచిన వేల కొద్దీ కిలోల మటన్, చికెన్‌లను ధ్వంసం చేయడంతో పాటు పెద్దసంఖ్యలో కేసులు నమోదు చేశాడు.

వెతికి వెతికి వెంటబడి ఎక్కడ అపరిశుభ్రత ఉందో... ఎక్కడ అక్రమ నిల్వలకు అవకాశముందో అక్కడ 'పిడుగు'లా ప్రత్యక్షమై ఫైన్లతో, కేసులతో కొరడా ఝుళిపిస్తున్నాడీ యువ అధికారి.

కరోనా దెబ్బకు ప్రజలు విలవిలలాడుతున్న తరుణంలో సంపాదనే ధ్యేయంగా కుళ్లిపోయిన మాంసాహారం, కాలంచెల్లిన ఆహారపదార్థాలు అమ్ముతున్న వారి భరతంపడుతూ ఆరోగ్య భద్రతే లక్ష్యంగా నిత్యం హోటళ్లు, రెస్టారెంట్లు, దుకాణదారుల వెంటపడుతున్న వెంకటరమణని అందరూ అభినందిస్తున్నారు. ఇలాంటి అధికారి నెల్లూరు నగర కార్పొరేషన్లో వున్నందుకు ఆనందిస్తున్నారు.

# రొయ్యరైతుల కష్టాలు తీరిపోనున్నాయి

◉ దళారీల దోపిడీకి ఇక చెల్లుచీటీ

◉ రైతులకు ఇచ్చిన హామీ నెరవేర్చిన సిఎం జగన్

◉ కొత్తగా ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు

రాష్ట్రంలో ఆక్వా రైతులు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలను తీర్చేవిధంగా రాష్ట్రప్రభుత్వం 'ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ'ని నియమిస్తూ కొత్త చట్టం తీసుకువచ్చింది. ముఖ్యమంత్రి వైయస్ జగన్ పుణ్యమా అంటూ ఇన్నాళ్ళకి ఇన్నేళ్ళకి రొయ్యరైతుల కష్టాలు కడతేరిపోయే మంచి రోజులు వస్తున్నాయి. రైతుల అభ్యున్నతికి, చేపలు.. రొయ్యల సాగు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఒక ప్రాధికార సంస్థను ఏర్పాటుచేయడంతో రైతుల్లో ఆనందం వెల్లువెత్తుతోంది.



పాదయాత్ర సమయంలో వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ఈనెల 21న 'ఆక్వా అభివృద్ధి ప్రాధికార సంస్థ' ఏర్పాటు చేయడం పట్ల రొయ్యల రైతాంగం, మత్స్యకారుల్లో సంతోషం కలుగుతోంది. రైతాంగం దళారీల దోపిడీకి గురికాకుండా ఈ సంస్థ రైతాంగానికి ఒక రక్షణ కవచంలా నిలుస్తుంది. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలను యూనిట్‌కు 3.86 నుంచి 1.50 రూపాయికి తగ్గించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్, ఆ తర్వాత కూడా మత్స్యకారులకు భరోసా ఇస్తూ పలు పథకాలు రూపొందించారు. రొయ్యల రైతులకు, చేపల పెంపకందారులకు వారి ఉత్పత్తుల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు.

### రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా...

రైతాంగం సంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్ తీసుకుంటున్న చర్యలు రైతాంగానికి మేలుబాటలు వేస్తున్నాయి. తాజాగా, ఆక్వా రైతుల ప్రయోజనాలకు ఇబ్బంది లేకుండా ఆక్వా అభివృద్ధి ప్రాధికార సంస్థ అన్ని చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమవుతోంది. ముఖ్యంగా, రొయ్యలకు ధరలను నిర్ణయించి అధికారుల పర్యవేక్షణలో కొనుగోళ్ళు జరిపేలా ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా వ్యాపారులు, ఎగుమతిదారులకు ఇబ్బంది లేకుండా వారి సమస్యలను పరిష్కరించి విదేశాలకు ఆక్వా ఎగుమతులు బాగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. అయితే మొత్తంగా ఆక్వారైతుల సమస్యలు తీర్చేందుకు ఒక కట్టుదిట్టమైన వ్యవస్థ అంటూ లేకపోవడంతో ముఖ్యమంత్రి జగన్ పలుసార్లు ఈ విషయమై చర్చించి, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కూడా సంప్రదించి కొత్త చట్టం రూపొందించి ఈ ప్రాధికార సంస్థను ఏర్పాటు చేశారు. దీంతో, రైతులకు నాణ్యమైన ఫీడ్‌ను, సీడ్‌ను ఇతర ఇన్‌పుట్స్‌ను సకాలంలో సరసమైన ధరలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించనున్నారు. కనీస మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### ఆక్వా రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం :

ఆక్వా రంగాన్ని మరింతగా బలోపేతం చేసే లక్ష్యంతోనే ఈ కొత్త చట్టం తీసుకువచ్చారు. రైతుల ప్రయోజనాలు కాపాడడమే దీని ఉద్దేశ్యం. తమ ఉత్పత్తుల విక్రయాల్లోనూ రైతులు ఎలాంటి నష్టానికి గురికాకుండా చూడడమే ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. రైతులు, మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తూ, మధ్య దళారీలు కమీషన్ ఏజెంట్ల బారి నుంచి రైతాంగాన్ని రక్షించేందుకు ఈ సంస్థ ఎంతగానో ఉపయోగపడుతుంది. విపత్తుల సమయంలో రైతులు దోపిడీకి గురికాకుండా ప్రభుత్వం జోక్యం చేసుకుంటుంది. అధికారులు నిర్ణయించిన ధరలకు ఎగుమతిదారులు రొయ్యలను కొనుగోలుచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

### నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు

రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించడం కోసం సంబంధిత వ్యాపార సంస్థలు, హేచరీస్‌లలో తరచూ తనిఖీలు, ఆడిట్ చేయడం, నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై కఠినచర్యలు తీసుకోవడం కూడా జరుగుతుంది. అనధికార చేపల పెంపకం, ప్రాసెసింగ్, పంపిణీ, అమ్మకం యూనిట్లను క్రమబద్ధీకరించడం జరుగుతుంది. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పాదక భూములను చేపల పెంపకం చెరువులుగా మార్పిడి చేయడాన్ని ఈ సంస్థ నియంత్రిస్తూ చర్యలు చేపడుతుంది. సీడ్, ఫీడ్‌లపై నాణ్యత పాటించని సంస్థలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ సంస్థ సమాయత్తమవుతోంది. ఆ మేరకు త్వరలోనే ఈ సంస్థకు ఖచ్చితమైన విధి విధానాలను కూడా ప్రభుత్వం సిద్ధం చేస్తోంది.

# పేదలకు రక్షణ, ప్రశాంతత కరువైంది


- సోమిరెడ్డి

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు రక్షణ, ప్రశాంతత కరువైందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. అధికార పార్టీ నేతలు చెప్పిందే వేదంగా అధికారులు అడ్డగోలుగా వ్యవహరించడం తగదన్నారు. ఈమేరకు ఆయన ఈనెల 21 న ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో, జిల్లాలో టీడీపీ మద్దతుదారులను టార్గెట్ చేసి వెంబడించి వేధిస్తున్నారన్నారు. జిల్లాలో కొంతమంది రెవెన్యూ, పోలీస్ అధికారుల తీరుకు పరాకాష్ట చెర్లోపల్లి ఘటనని, బలవంతంగా భూములు లాక్కొనే ప్రయత్నం చేసి దళిత మహిళలు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు తేవడం దురదృష్టకర మన్నారు. చెర్లోపల్లితో పాటు నిడిగుంటపాళెం, గుడ్లూరువారి పాళెం, ముదిగేడు ప్రాంతాల్లో ఎస్సీలు, బీసీలు, గిరిజనుల భూములే లక్ష్యంగా చేసుకున్నారన్నారు. కొంతమంది పరిధి దాటి ప్రవర్తిస్తూ పేదలను మానసికంగా వేధిస్తున్నారని సోమిరెడ్డి మండిపడ్డారు. పేదల భూములపై జరుగుతున్న వరుస ఘటనలపై కలెక్టర్, ఎస్పీ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ప్రతి 10వేల మందికి
## ఒక ఆరోగ్యకేంద్రం

జిల్లాలో కొత్తగా 37 వైయస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను త్వరలో ఏర్పాటుచేసేందుకు కృషి జరుగుతోందని జేసీ ప్రభాకరరెడ్డి తెలియజేశారు. ఈనెల 23న నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ హెల్త్ సెంటర్లను ఏర్పాటుచేసేందుకు స్థలాలను త్వరితగతిని సేకరించాలని మునిసిపల్ కమిషనర్లను ఆదేశించినట్లు చెప్పారు. ప్రతి 10వేల మందికి ఒక అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటున్నామని, నెల్లూరులో 18, సూళ్ళూరుపేటలో 3, వెంకటగిరిలో 2, నాయుడుపేటలో 3, కావలిలో 5, గూడూరులో 4, ఆత్మకూరులో 2 హెల్త్ సెంటర్ల వంతున ఏర్పాటు చేయనున్నామని వివరించారు.

## బీహార్‌కు వీవీ ప్యాట్స్

బీహార్‌లో త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికలకు అవసరమైన 743 వీవీ ప్యాట్స్‌ను నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ ఆవరణంలో గల ఈవీఎం భద్రత గది నుంచి ఈనెల 20న తరలించారు. ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్ వీటిని తనిఖీ చేశారు. తగిన భద్రత నడుమ బీహార్ కు తరలించాల్సిందిగా ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయ ఏఓ మధుసూదనశర్మ, కార్యాలయాధికారులు కవిత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు జిల్లా జడ్జి బదిలీ

నెల్లూరు 3వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న గొల్లా శ్రీదేవిని విశాఖపట్నం ఫోక్సో స్పెషల్ కోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో విశాఖపట్నం 2వ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న వీవీ శ్రీనివాసమూర్తిని నియమించింది.

## ఏసీబీ డీఎస్పీకి పదోన్నతి

నెల్లూరు ఏసీబీ డీఎస్పీ సీహెచ్ దేవానంద్ శాంతోకు ఏఎస్పీగా పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 40మంది డీఎస్పీలకు(అదహక్ ప్రమోషన్లు) ఏఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా డీఎస్పీ దేవానంద్ శాంతో ఏఎస్పీగా పదోన్నతి పొందారు.

## హడ్కోకి రూ.27.53 కోట్లు

నెల్లూరు నగరంలో తాగునీటి పథకాలకు సంబంధించి హడ్కోకి రూ.27.53 కోట్లు చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22న ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుదేశం పార్టీ హయాంలో నగరంలో తాగునీటి పథకాల కోసం హడ్కో నుంచి భారీగా రుణాలు పొందారు. వాటికి అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వమే చెల్లింపు బాధ్యతలు తీసుకోవడంతో ఈ మేరకు రూ.27.53 కోట్లు చెల్లిస్తూ నెల్లూరు కార్పొరేషన్‌కు ఆ నిధులను బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

### యోగా దినోత్సవ
## రాష్ట్ర కో-కన్వీనర్‌గా ప్రసన్న



నెల్లూరులోని యోగా మాస్టర్ ప్రసన్నకుమార్‌కు అరుదైన అవకాశం లభించింది. అంతర్జాతీయ యోగా వేడుకలకు రాష్ట్ర కో-కన్వీనర్‌గా ప్రసన్నను నియమిస్తూ ఐఎన్ఓ అధ్యక్షుడు డాక్టర్ అనంత్ బిర్డార్ ఈనెల 19న ఉత్తర్వులు జారీచేసినట్లు ఆయన తెలిపారు. లాక్‌డౌన్ నేపథ్యంలో అంతర్జాతీయ యోగా వేడుకలను ఫేస్‌బుక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నామని ఆయన పేర్కొంటూ, వివరాలకు 88856 68752 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

### మెడికవర్‌లో...
## అరుదైన శస్త్ర చికిత్స



నెల్లూరులోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఊపిరితిత్తులకు సంబంధించిన అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహిం చారు. ఈనెల 22న ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ సుస్మిత, డాక్టర్ లోకేష్, డాక్టర్ నందా, డాక్టర్ త్రిలోక్ మాట్లాడారు. చిత్తూరు జిల్లా అన్నంబాకం గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి(46) కొంతకాలంగా ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతూ ఈనెల 19న తమ ఆసుపత్రికి వచ్చాడన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించగా అతని ఊపిరితిత్తులు ఆనుకొని 20సెంటీమీటర్ల గడ్డ ఉన్నట్లు గుర్తించామన్నారు. దానిని హైడాటిడ్ సిస్ట్‌గా నిర్ధారించి, శస్త్ర చికిత్సతో తొలగించామని చెప్పారు. ప్రస్తుతం బాధితుడు పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు. ఆసుపత్రి చీఫ్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ రూ.4లక్షలు ఖరీదయ్యే ఈ శస్త్ర చికిత్సను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేసినట్లు తెలిపారు.

## రీ కౌంటింగ్ ఫీజు గడువు పెంపు

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోసం ఫీజు చెల్లించేందుకు ఈనెల 29వతేదీ వరకు గడువును పెంచారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. రీ కౌంటింగ్ కోసం ఒక్కో పేపర్ కు రూ.260, రీ వెరిఫికేషన్ కోసం ఒక్కో పేపర్ కు రూ.1300 చెల్లించాల్సి వుంది. దరఖాస్తును http@//bie.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా పంపాల్సి వుంది.

## నెల్లూరు కబుర్లు

### ఇళ్ళ స్థలాలపై...
## సర్వే చేయండి
- కమిషనర్ బాపిరెడ్డి



ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయనున్న నివేశ స్థలాలపై సమగ్ర విచారణ చేపట్టాలని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ టి.బాపిరెడ్డి ఆదేశించారు. ఈనెల 23న సచివాలయ ఉద్యోగులతో ఆయన తన కార్యాలయంలో సమీక్షించారు. ఇప్పటికే ఒక విడత సర్వే పూర్తయిందని, తదనంతరం అందిన వివరాల మేరకు డిజిటల్ సంతకాలతో తుది జాబితాను సచివాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వాటిపై ఎవరైనా అభ్యంతరాలు తెలిపితే వెంటనే దర్యాప్తు జరిపి నివేదికలు అందజేయాలని సూచించారు. సమీక్షలో ఇన్ చార్జి అదనపు కమిషనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

### పంచాయితీరాజ్ ఇన్‌చార్జి ఎస్ఈగా
## రాజేంద్రప్రసాద్ ఆచారి

నెల్లూరు జిల్లా పంచాయితీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఎస్ ఈ వీరాస్వామి ఈనెల 30 వరకు సెలవు పొడిగించారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఎస్‌ఈగా రాజేంద్రప్రసాద్ ఆచారిని నియమించింది. నెల్లూరు నగరంలోని పంచాయితీరాజ్ ఇంజినీరింగ్ శాఖ (ప్రాజెక్ట్స్ విభాగం) ఈఈగా ఉన్న ఆయన ఈనెల 24న బాధ్యతలు తీసుకున్నారు.

### పుస్తక ఎంపిక సలహా కమిటి
## సభ్యుడిగా రఘు



జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వారా రచయితల నుంచి పుస్తకాలను కొనుగోలు చేసేందుకు జిల్లా పుస్తక ఎంపిక సలహా కమిటీ సభ్యునిగా మాజీ విశ్రాంత లేబర్ డిప్యూటీ కమిషనర్ రాచపాళెం రఘును పౌరగ్రంథాలయ శాఖ వారు నియమించారు. నెల్లూరులోని రేబాలవారి వీధిలో ఉన్న కేంద్ర గ్రంథాలయంలో ఆ సంస్థ సెక్రటరీ వరప్రసాద్ నుంచి ఆయన ఆ మేరకు ఈనెల 23న నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కమిటీలో 16 మంది సభ్యులుగా ఉంటారని వారు పేర్కొన్నారు.

## సీనియర్ సివిల్ జడ్జీల బదిలీలు

నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న పీజే సుధను తూర్పు గోదావరి జిల్లా రాజోలు సీనియర్ సివిల్ జడ్జీగా బదిలీ చేశారు. ఈమె స్థానంలో ప్రకాశం జిల్లా మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాసులునాయక్‌ను నియమించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జీగా పని చేస్తున్న టి.హరితను శ్రీకాకుళం జిల్లా టెక్కలి సీనియర్ సివిల్ జడ్జిగా, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎం.రామకృష్ణంరాజును ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఈనెల 23న ఉత్తర్వులు జారీ చేసింది.

### ఇంటర్మీడియట్ ఫలితాల్లో
## విశ్వసాయి హవా

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో విశ్వసాయి విద్యార్థులు చక్కని ప్రతిభను చాటారు. బైపీసీ, యంపీసీ ల్లో మంచి ఫలితాలను సాధించారు. సీనియర్ ఇంటర్ విద్యార్థులు 146 మంది 9.8 నుండి 10 జిపిఎ సాధించారని, జూనియర్ ఇంటర్ బైపీసీ, యంపిసి గ్రూపుల్లో 383 మంది విద్యార్థులు 400 మార్కులు పైగా సాధించారు. మంచి ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, వారి తల్లిదండ్రులు అభినందించారు.

## ఐటీటీఎంలో ప్రవేశానికి దరఖాస్తులు

నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగమూడి వద్ద నున్న ఐటీఎం కళాశాలలో 2020-21 సంవత్సరానికి బీబీఏ, ఎంబీఏ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల నోడల్ అధికారి మీరా ఈనెల 23న తెలిపారు. బీబీఏ (టూరిజం, ట్రావెల్స్ మేనేజ్ మెంట్) కాల వ్యవధి మూడేళ్ళు, ఎంబీఏ రెండేళ్ళు(2020-22)గా ఉంటుందన్నారు. బీబీఏకు ఇంటర్ విద్యార్హత వుండి, 22 సంవత్సరాలుండాలని, ఎంబీఏకు డిగ్రీ విద్యార్హత వుండి 27 ఏళ్ళు వయస్సు ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. వివరాలకు 98662 74850, 94907 87854 నంబర్లలో సంప్రదించాలని కోరారు. పర్యాటక రంగంలో విస్తృత ఉద్యోగ అవకాశాలున్నాయని జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నవోదయ ఫలితాల్లో
## నేతాజీ విద్యార్థుల విజయం

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జవహర్ నవోదయ విద్యాలయం వారు నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో నెల్లూరు నగరంలోని శ్రీ నేతాజీ (యంయస్ఆర్) పైలట్ హైస్కూలు విద్యార్థులు 21 సీట్లు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ యంవి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విజయసాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను, సహకరించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు. నవోదయ ఇన్‌చార్జి ఎన్. ప్రసన్న, డైరెక్టర్ నరేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ జి.లక్ష్మీ దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## సంతపేటలో ఇల్లు దగ్ధం

నెల్లూరు సంతపేట నాలుగుకాళ్ళ మండపం వద్ద ఈనెల 23న ఓ ఇల్లు దగ్ధమైంది. ఆ ఇంటిలో నివశించే నాగేశ్వరరావు, రమాదేవి దంపతులు ఇంట్లోనే టిఫిన్, కూల్‌డ్రింక్స్ దుకాణం నిర్వహిస్తుండేవారు. అనారోగ్య కారణంతో గత 4 నెలలుగా తిరుపతిలోని కుమార్తె వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 23న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దాదాపు 3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లి వుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

వన్య ప్రాణుల సంరక్షణకు అటవీ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అటవీశాఖాధికారి షణ్ముఖ కుమార్ ఆదేశించారు. వెలిగొండ అటవీ ప్రాంతంలో పెరుగుతున్న ఎర్రచందనం చెట్లను ఈనెల 23న పరిశీలించారు. గతంలో ట్యాగింగ్ చేసిన ఎర్ర చందనం చెట్లను పరిశీలించారు. అటవీ విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నియంత్రణకు నిఘా పెంచాలని, స్మగ్లర్లు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

### పదిరోజుల్లోనే పింఛన్..

# జగనన్నకే సాధ్యం

## ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న



అర్హులైన పేదలకు కేవలం పదిరోజుల వ్యవధిలోనే కొత్తగా పింఛన్‌లు మంజూరు చేయడం జగనన్నకే సాధ్యమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి కొనియాడారు. ఈనెల23న ఆయన ఇందుకూరుపేట మండలంలోని కొరుటూరు గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన లేఅవుట్లలోని ప్లాట్లను లాటరీద్వారా లబ్దిదారులకు కేటాయించారు. కొత్తగా పింఛన్ మంజూరైన లబ్దిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో కొత్త పింఛన్ రావాలంటే ఆ గ్రామంలో ఒక పింఛన్‌దారుడు మరణిస్తేనే మరొకరికి పింఛన్ ఇచ్చేవారని విమర్శించారు. చంద్రబాబు పాలనలో వ్యవస్థలన్నిటినీ ధ్వంసం చేశారని ఆయన దుయ్యబట్టారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటుండడం ఎంతో సంతోషకరమన్నారు.. అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం అందించేలా ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారన్నారు. కరోనా సమయంలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని చంద్రబాబు విమర్శించడం సముచితం కాదన్నారు. ముఖ్యమంత్రిని విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, తహశీల్దార్ పద్మజ, ఎంపిడిఓ రఫీఖాన్, వైఎస్సార్సీపి మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి విజయకుమార్, డిసిఎంఎస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతను పాటించండి

## జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు



పరిశుభ్రతను, పర్యావరణాన్ని నిరంతరం పరిరక్షిస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అధికారులకు సూచించారు. రోడ్డు నిర్మాణాలు మరమ్మత్తుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, వాటిని ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆయన సూచించారు. ఈనెల 23న నెల్లూరు నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు చెప్పారు. కాలువల్లో పూడికతీత పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం మాగుంట లేఅవుట్‌లోని మాగుంట సుబ్బరామిరెడ్డి స్మారక పార్కును, అపోలో ఆసుపత్రి వద్ద ఉన్న చిల్డ్రన్స్ పార్కును పరిశీలించారు. పార్కుల్లో పరిశుభ్రతను పచ్చదనాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట కార్పొరేషన్ కమిషనర్ బాపిరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ మోహన్, కార్పొరేషన్ ఎస్ఇ ఇమాముద్దీన్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా.. ముక్కాల ద్వారక

(మొదటి పేజీ తరువాయి)

మాదాల గోపాలయ్య శాసనసభ్యునిగా పోటీచేసి ఓడిపోయినట్లు కొంతమేరకు చరిత్ర చెప్తోంది తప్ప ఆ తరువాత కాలంలో ఎవరూ పెద్దగా ఉన్నత పదవులు పొందలేదు. దేవాలయాల ఛైర్మెన్లు, ట్రస్టుబోర్డు సభ్యులుగా తప్ప అంతకుమించిన పదవులు పెద్దగా చెప్పుకోదగ్గ స్థాయిలో ఎవరికీ రాలేదు.

పాత తరాలను పక్కన పెడితే ఈ తరానికి నవతరం నాయకుడిగా ఎదుగుతున్న వ్యక్తి, యువశక్తి ముక్కాల ద్వారకానాథ్. ద్వారక ఆది నుండి ఒక ప్రణాళిక ప్రకారం తన రాజకీయ భవిష్యత్తుకి పునాది వేసుకుంటూ వస్తున్నాడు. ముందుగా మెగాస్టార్ అభిమానిగా 2008లో ప్రజా రాజ్యం పార్టీతో రాజకీయ ఆరంగేట్రం చేసి దాదాపుగా 2009 ఎన్నికల్లో శాసన సభ్యత్వానికి తన పేరు ప్రతిపాదన వచ్చే స్థాయికి ఎదిగాడు, చివరినిముషంలో అభ్యర్థి మారడంతో అలగకుండా పరిపక్వత కలిగిన రాజకీయ నాయకుడిగా ప్రవర్తించి ఆ అభ్యర్థి విజయానికి కృషి చేశాడు.



తరువాతి రోజుల్లో జరిగిన అనేక రాజకీయ పరిణామాల కారణంగా వై.యస్. జగన్ పట్ల ఆకర్షితుడై 2014, 2019 ఎన్నికల్లో అనిల్‌కుమార్‌యాదవ్ విజయానికి తనవంతు కృషి చేశాడు. 2014లో జరిగిన మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో తెలుగుదేశం కంచుకోట అయిన 6వ వార్డు నుండి ఘన విజయం సాధించి నగరంలో గెలిచిన మొత్తం వార్డు సభ్యుల్లో ఒకే ఒక ఆర్యవైశ్య సభ్యుడుగా డిప్యూటీ మేయర్‌గా ఎంపికయ్యాడు.

ఎదిగే కొద్దీ ఒదగాలన్న స్వభావం కలిగిన ద్వారక తరువాతి కాలంలో సమర్థత సౌమ్యత కలిగిన నాయకునిగా, అజాత శత్రువుగా అందరి మనసులను దోచుకున్నాడు.

వై.యస్.జగన్ ప్రజా సంకల్పయాత్ర సమయంలో ఆర్యవైశ్య సదస్సు ఏర్పాటుచేసి తామంతా ఏకపక్షంగా జగన్‌వైపు ఉన్నామని చెప్పకనే చెప్పాడు.

అన్నీ ప్రభుత్వమే చేయాలన్న సూక్తిని ద్వారక పాటించడు, ఎక్కడ అవసరమైతే అక్కడ తనకు చేతనైనంత మేరకు తన శక్తికి తగ్గట్లుగా స్వంత నిధులతో ప్రజా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తుంటాడు. లాక్‌డౌన్‌తో కష్టకాలంలో వున్న పేద ప్రజలకు తన స్వంత నిధులు 10 లక్షల రూపాయలు ఖర్చు చేసి నిత్యావసర సరుకులు అందించడమే ఇందుకు నిదర్శనం.

### ఆర్యవైశ్య సంఘం అభివృద్ధి కోసం...

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘానికి 2014లో అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికై దాదాపు 6సంవత్సరాల పాటు ఆర్యవైశ్యులకు చేసిన వాగ్దానానికి కట్టుబడి 45లక్షలకు పైగా విలువ కలిగిన ఆర్యవైశ్య భవన్‌ను తన సొంత నిధులతో నిర్మించి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభకు రిజిస్టర్ చేసిచ్చాడు. అనేకమంది ఆర్యవైశ్యుల స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్లు, గ్రైండర్లు, తోపుడు బండ్ల ద్వారా ఆదుకున్నాడు. బాడుగ ఇళ్ళలో వుండి చనిపోయినప్పుడు పార్థివ దేహాలను వుంచుకోవడానికి ఇబ్బందులు పడుతున్న తరుణంలో కార్పొరేషన్ సహకారంతో బోడిగాడితోటలోని 120 అంకణాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయింపజేసి 60 అంకణాలు ఆర్యవైశ్యులకు, 60 అంకణాలు అన్ని కులాల వారికి విడివిడిగా వసతి గృహాలను ప్రారంభింపజేయడంలో ద్వారక కీలక పాత్ర పోషించాడు.

దాదాపు 120 సంవత్సరాల చరిత్ర కలిగి, శిథిలావస్థకు చేరిన స్టోన్‌హౌస్ పేటలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని, పరమేశ్వరి మాత ఆశీస్సులతో భక్తుల సహకారం, దాతల ప్రోత్సాహంతో దాదాపు 10కోట్ల రూపాయల ఖర్చుతో పునర్నిర్మాణం చేసి రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మక ఆలయంగా తీర్చిదిద్దడంలో ద్వారక కృషి అభినందనీయం. ఆలయ ప్రధాన ద్వారం వద్ద వున్న సుమారు 32 దుకాణాలను తొలగించి తిరిగి ఆధునీకరించి వారికే అప్పచెప్పడం ఆయనకే సాధ్యమయ్యింది.

ఇన్ని సద్గుణాలతో ఎన్నో సత్కార్యాలను చేసిన ముక్కాల ద్వారకానాథ్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభకు అధ్యక్షుడిగా నియమింపబడ్డారు. ఆ సంస్థకు ఇటీవల జరిగిన ఎన్నికలలో నాటకీయపరిణామాల మధ్య ద్వారక ఓడిపోయినప్పటికి, ద్వారకకి వున్న మంచిపేరు, పరపతిని గుర్తించిన సభ్యులు జూన్ 18వ తేదీన ఆయనను పిలిచి మరీ పట్టం కట్టి అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టారు. రాష్ట్రవ్యాప్త వైశ్య సోదరులకు ద్వారక లాంటి వ్యక్తి సేవల అవసరమన్నది వారి భావన. స్వతహాగా బ్యాడ్మింటన్ క్రీడాకారుడైన ద్వారక ఈ అధ్యక్ష పదవి ద్వారా ఇంకా మంచి గుర్తింపును సాధించి ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నది జిల్లా ఆర్యవైశ్యుల కోరిక. ఆల్ ది బెస్ట్ టు ద్వారక.

## ఆర్టీసీకి దెబ్బ మీద దెబ్బ

కరోనా ప్రభావంతో లాక్‌డౌన్ కారణంగా బస్సులు తిరగక నష్టాల ఊబిలో వుంటే డీజిల్ ధర పెంపు సంస్థను మరింత కుంగదీస్తోంది. ఆర్టీసీకి ఎక్కువగా లాభాలు తెచ్చిపెట్టే వేసవి సీజన్‌లో ఒక్క బస్సు కూడా రోడ్డెక్కక పోవడం, వైరస్ నియంత్రణ చర్యల్లో భాగంగా బస్సుల కుదింపు, సీట్లు తగ్గించడం, ఆదాయం వచ్చే రూట్లకు బస్సులు తిరగకపోవడం, అదీగాక ఆశించిన స్థాయిలో ప్రయాణీకులు రాకపోవడంతో సంస్థ తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణీకుల సౌకర్యార్థం బస్సులు నడుస్తున్నాయి. ఇదిలా వుంటే గత 16 రోజులుగా వరుసగా పెరుగుతున్న డీజిల్ ధర ఈనెల 23వ తేదికి రూ.9.46లకు చేరింది. లీటర్‌పై ఇంతలా డీజిల్ ధరలు పెరగడంతో అధికారులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కుంభకోణాలకు చిరునామాగా వైకాపా

## టిడిపి నాయకుల విమర్శ



ఏడాది పాలనలో కుంభకోణాలకు చిరుమానాగా వైకాపా ప్రభుత్వం మారిందని, గతంలో టీడీపీ ప్రభుత్వానికి కేంద్రం నుంచి అనేక ప్రశంసలు వచ్చాయని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్ ఆరోపించారు. ఈనెల 23న నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో రవిచంద్ర మాట్లాడుతూ 108 వాహనాలను ఎందుకు పక్కన పెట్టాల్సి వచ్చిందని, కొత్త కేటాయింపుల్లో రివర్స్ టెండరింగ్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పటి వరకు 108 వాహనాలు నిర్వహిస్తున్న జీవికే సంస్థకు గడువు డిసెంబరు వరకు ఉన్నా ఆరునెలల ముందే రద్దు చేసి ప్రభుత్వ పెద్దల కుటుంబాలకు ఇచ్చారని, ఆర్టీసీ, విద్యుత్తు, ఇంధన ధరలు తగ్గిస్తామని చెప్పి విపరీతంగా పెంచారన్నారు. మాజీమేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ జిల్లాలో 39,760 ఇళ్ళు నిర్మిస్తే 4,800 నెల్లూరులోనే ఉన్నాయని, వీటికి పేద ప్రజల వద్ద నుంచి తీసుకున్న రూ.34 కోట్ల నగదు ప్రభుత్వం వద్దే ఉందన్నారు. ఈ ఇళ్ళు ఇచ్చేవరకు పోరాటం చేస్తామన్నారు. గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు కేటాయించే ఇళ్ళ స్థలాల్లో వైయస్సార్‌సీపీ నాయకులు వివక్ష చూపుతున్నారన్నారు. వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ మాట్లాడుతూ వెంకటగిరిలో నిర్మించిన 2350 ఇళ్ళు లబ్దిదారులకు ఇవ్వకుండా కొత్తగా స్థలాలు ఇస్తామంటున్నారని విమర్శించారు. నుడా మాజీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, తాళ్ళపాక అనూరాధ, ఖాజావలి, తిరుమల నాయుడు, అమ్రుల్లా, సాబీర్ పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

అఖిలభారత కాంగ్రెస్ నాయకులు, పార్లమెట్ సభ్యులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఈనెల 19 న నెల్లూరు కెయస్ ఆర్ కాంప్లెక్స్ లో ఏపీసీసీ అధికార ప్రతినిధి కనకట్ల రఘురాం ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రఘురాం ముదిరాజ్ కేక్ కట్ చేసి మాట్లాడుతూ ఈ దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యులుగా పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## అనుమానితుల సమాచారం తెలపండి



- టౌన్ సిఐ దశరధరామారావు

గూడూరు పట్టణంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు, అనుమానితుల సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని, బయటివ్యక్తులను ఎవ్వరూ నమ్మవద్దని గూడూరు టౌన్ సిఐ దశరధరామారావు ప్రజలకు తెలియజేశారు. ఇళ్లలో పడుకున్నప్పుడు తలుపులు లోపల నుంచి లాక్ చేసుకోవడం మరచిపోవద్దని, బంగారు వస్తువులకు మెరుగు పెడతామని ఎవరైనా వస్తే వారిని ఇళ్లలోకి రానివ్వవద్దని పేర్కొన్నారు. ఈనెల 22న ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇల్లు వదిలి ఎక్కడికైనా వెళ్ళవలసివస్తే బంగారు, వెండి ఆభరణాలను, డబ్బును బ్యాంకు లాకర్‌లలో భద్రపరచుకోవాలన్నారు. ఇళ్లకు తాళాలువేసి వెళ్లవలసివస్తే పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్ళాలని, లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా పోలీసు గస్తీ ఏర్పాటుచేసి ఇళ్లలో దొంగతనాలు జరగకుండా చూడగలమని ఆయన చెప్పారు. పోలీసులకు ఏదైనా సమాచారం ఇవ్వదలిస్తే ఫోన్ 9490413803, లేదా 9440796342, 70132 27724 నెంబర్లకు తెలియజేయాలని ఆయన సూచించారు.

## కార్మికుల ఆర్థికసాయం కోసం హెల్ప్ డెస్క్



- అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఓంకార్‌రావు

లాక్‌డౌన్ సందర్భంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న భవన మరియు నిర్మాణ రంగ కార్మికులకు ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు నుంచి ఆర్థిక సాయం అందజేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయని గూడూరు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కె.ఓంకార్‌రావు తెలిపారు. ప్రతి కార్మికుని బ్యాంకు ఖాతాకు డిబిటి పద్ధతిలో నగదు జమ చేయడం కోసం 'గుర్తింపుకార్డు' కలిగిన ప్రతి కార్మికుని సహాయార్థం గూడూరు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. గూడూరు డివిజన్‌లో గుర్తింపు కార్డు కలిగిన కార్మికులు ఆధార్, బ్యాంక్ అకౌంట్, గుర్తింపుకార్డు నకలు మరియు వాటిపై ఫోన్ నెంబరు రాసి, కోవిడ్-19 నిబంధనలు పాటిస్తూ ఈ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

## మునిసిపల్ పార్కులో మొక్కలు నాటిన మహిళామణులు



మొక్కలు నాటుతున్న డాక్టర్ సి.రోహిణి, జీవనిరెడ్డి తదితరులు

గూడూరు పట్టణంలోని సొసైటీ కాలనీలో ఉన్న సర్వేపల్లి రామారావు మునిసిపల్ పార్కులో ఈనెల 23న ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళామండలి సంస్థల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మహేంద్ర సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రోహిణి దాతృత్వంతో పార్కులో మూడు కుర్చీలు ఏర్పాటుచేశారు. ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు మల్లాబత్తిన జీవనిరెడ్డి, ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి, స్నేహలతారెడ్డి, విష్ణువందన, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ యోగాసనాలు



గూడూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఆల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో యోగా శిక్షకుడు రాజా ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహించారు. కరోనా వైరస్ కారణంగా సామాజిక దూరాన్ని పాటిస్తూ ఈ కార్యక్రమం చేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు యమహా సుబ్రహ్మణ్యం, పాశం సునీల్‌కుమార్, చంద్రశేఖర్, కడివేటి చంద్రశేఖర్, సుధాకర్, చెంచుకృష్ణయ్య, కెఆర్‌ఎం వెంకటేశ్వర్లు, మల్లి, శీను, మస్తానయ్య పాల్గొని యోగా గురువు కట్టా మురళీకృష్ణను సన్మానించారు.

## సిఎం జగన్‌కు బ్రాహ్మణ సేవా సంఘం కృతజ్ఞతలు







రాష్ట్ర బడ్జెట్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 200 కోట్లు కేటాయించడంపై ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గూడూరు శాఖ గౌరవాధ్యక్షులు శ్రీకంటి రామ్మోహన్‌రావు, అధ్యక్షులు యరగుడిపాటి చలపతిరావు, ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి తమ కృతజ్ఞతలు తెలిపారు.

## వీర జవాన్‌లకు ఘన నివాళి




దేశం కోసం ప్రాణాలను అర్పించిన వీర జవాన్‌లకు గూడూరులోని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న ఘన నివాళులర్పించారు. స్థానిక టవర్‌క్లాక్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో భారత్ జవాన్లపై చైనా దాడులను తీవ్రంగా ఖండించారు. పలు రకాల చైనా వస్తువులను ధ్వంసం చేసి వాటి వాడకాన్ని నిరసించారు. ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు సురేంద్రనాథ్‌రెడ్డి, కోశాధికారి కె.శ్రీనివాసులు, కార్యవర్గసభ్యులు బాలయ్యనాయుడు, రామమోహన్ రావు, గ్రానైట్ ప్రభాకర్, మేకల మస్తానయ్య, ప్రజేంద్రరెడ్డి, డిఎస్ఆర్ మొబైల్స్ సుధీర్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, శ్యామ్, వాచ్‌షాప్ రాము, శీను, అలీ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్యం.. సంగీతంతో ఆనందం

## ఒకేరోజున రెండు అంతర్జాతీయ దినోత్సవాలు





***యాదృచ్ఛికమే అయినా ఈసారి అటు 6వ అంతర్జాతీయ యోగా దినోత్సవం, ఇటు ప్రపంచ సంగీత దినోత్సవం రెండూ ఒకరోజే (జూన్21) రావడం విశేషమే. శారీరక ఆరోగ్యానికి యోగా, మానసిక ఉల్లాసానికి సంగీతం ఈ రెండూ కూడా సకల మానవాళికి ఎంతో ఉపయోగపడేవే. అందుకే ప్రపంచవ్యాప్తంగా వీటి ప్రాధాన్యత పెరుగుతోంది.***

భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా, ఆరోగ్యానికి బాసటగా ఎంతో ప్రాచీనకాలం నుంచి యోగా అందరికీ అందుబాటులోనే ఉంది. యోగాతో రోగాలు మాయమవుతాయని పూర్వకాలంలో మనదేశంలోని మహర్షులు ఈ అత్యద్భుతమైన ప్రక్రియను అందుబాటులోకి తెచ్చారు. నిరంతర యోగ సాధనతో శారీరక, మానసిక సమస్యలు దూరమవుతాయని నేటి అధునాతన కాలంలోని నిపుణులు కూడా స్పష్టం చేస్తున్నారు. నిత్యం అనేకరకాల వత్తిళ్ళతో, సమస్యలతో సతమతమవుతున్న నేటి యాంత్రిక జీవనంలోనూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగా ఎంతగానో ఉపకరిస్తుందని అందరికీ తెలిసిందే. 'వంటికి యోగా మంచిదేగా' అన్నట్లుగా ఈ కరోనా కష్టకాలంలో కూడా యోగా ప్రపంచవ్యాప్తంగా మరింత ఖ్యాతి పొందుతోంది. ఇళ్ళవద్దనే ఉంటూ, స్వీయనియంత్రణ పాటిస్తూ రోజూ ఓ గంట యోగా చేసినా ఆరోగ్యానికి మంచిదని, యోగాతో రోగాలు కూడా మాయమవుతాయని అందరూ విశ్వసిస్తున్నారు. శారీరకంగా దృఢత్వాన్ని కలిగించి మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించే దివ్యౌషధంగా యోగా ప్రపంచవ్యాప్తంగా అందరికీ ఎంతో ఉపయోగపడుతోంది. అదేవిధంగా సంగీతం కూడా అలాంటిదే. మానసికంగా ఎంతో ఉల్లాసాన్ని చేకూర్చేదే సంగీతం. శారీరకంగా యోగా, మానసికంగా సంగీతం ఈ రెండూ మానవజీవితానికి ఎంతో ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను చేకూరుస్తున్నాయి. మంచి సంగీతం వింటే చాలు మనసుకెంతో హాయి కలుగుతుందనేది అందరికీ తెలిసిందే. మానసిక ఒత్తిళ్ళను తగ్గించి ప్రశాంతతకు బాటలు వేసేది సంగీతమే. అలాగే యోగాలో ముఖ్యమైన యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం వంటి ప్రక్రియలు శరీరానికి దృఢత్వాన్నివ్వడమే కాక, అనేక రకాల వ్యాధుల బాధల నుంచి కూడా దూరం చేస్తాయి. అంతేకాదు, రోగ నిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుంది. యోగా చేయడం వల్ల రక్తప్రసరణ సక్రమంగా ఉంటూ శరీరంలోని అన్ని అవయవాలు పరిపూర్ణంగా పనిచేస్తాయి. శ్వాస బాగా తీసుకుంటే శరీరంలోని అన్ని భాగాలు ఆరోగ్యవంతంగా ఉంటాయి. యోగాసనాలు వేయడం, ధ్యానం చేయడం వంటివి మనలో ఏకాగ్రతను పెంచుతాయి.

**మానసిక ఉల్లాసాన్నిచ్చే మధురమైన సంగీతం :**

మధురమైన సంగీతం మానసిక ఉల్లాసాన్నిస్తుంది. పశుర్వేత్తి శిశుర్వేత్తి వేత్తి గానరసం ఫణి: అన్నట్లుగా పశువులు శిశువులు కూడా సంగీత మాధుర్యానికి పరవశం చెందాల్సిందే. పిల్లనగ్రోవి ఊదితే చాలు.. గోవులు ఆ వేణునాదానికి తన్మయమవుతుంటాయి. నాదస్వర రసాస్వాదనతో పాములు సైతం తలలూపుతుంటాయి. వేణుగానం, వీణానాదం, నాదస్వరం, ఘటం, మృదంగం ఇలా అనేకానేక వాద్య ధ్వనులతో సమ్మిళితమైన రాగాలు, శృతిపక్వమైన..మృదుమధురమైన గానం ఇవన్నీ మన మనసుల్ని ఇట్టే కట్టిపడేస్తాయి. ఆహ్లాదకరమైన సంగీతం వింటూ ఉంటే చాలు.. మానసిక క్లేశాలన్నీ వాటికవే మటుమాయమవుతాయన్నది అందరికీ అనుభవైకవేద్యమే!

ఇంతటి విశేషమైన ఈ రెండు రంగాల ప్రాముఖ్యతలను తలచుకుంటూ మానవాళికి యోగా, సంగీత రంగాలు చేస్తున్న మహోపకారాన్ని మరోసారి గుర్తుచేసుకుంటూ ముందుకు సాగుతోంది ప్రపంచం. అందుకే జూన్ 21వ తేది అంతర్జాతీయ యోగా దినోత్సవంతో పాటు ప్రపంచ సంగీత దినోత్సవాన్ని కూడా అందరితో పాటు నెల్లూరీయులు కూడా వేడుకగా జరుపుకున్నారు. అయితే, ఇప్పుడు కరోనా మహమ్మారి వ్యాధి నేపథ్యంలో సామూహికంగా కాక, ఎవరికి వారే ఇళ్లల్లో ఉంటూ అనునిత్యం యోగా చేసుకోవడమే ఉత్తమం కనుక అందరూ స్వీయ నియంత్రణ పాటిస్తూ యోగా చేసుకుంటున్నారు. నియమబద్ధంగా యోగాను ఆచరిస్తే అనేక రకాల రోగాలతో పాటు కరోనా వంటి వ్యాధులను కూడా జయించవచ్చని అనుభవజ్ఞులు ఈ సందర్భంగా సూచిస్తున్నారు.

## యోగాతో మానసికోల్లాసం

- అదనపు ఎస్పీ వెంకటరత్నం



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న జిల్లా అదనపు ఎస్పీ వెంకటరత్నం ఇంట్లోనే యోగా చేశారు. కరోనా వైరస్ నేపథ్యంలో ఇంట్లోనే యోగా చేసుకోవాలని పిలుపునివ్వడంతో అదనపు ఎస్పీ తన భర్తతో కలిసి యోగాసనాలు చేశారు. యోగాతో మానసికోల్లాసం, ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు.

# లేఅవుట్ల ప్రక్రియ పూర్తి చేయాలి

- జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్



పేదలకు నివేశన స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన స్థలాల్లో లేఅవుట్ల ప్రక్రియను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ఈనెల 21న నెల్లూరు జిల్లా పరిషత్‌లో డివిజనల్ రెవెన్యూ అధికారులు, సర్వే, జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,79,949 మంది లబ్ధిదారులను గుర్తించామని, ఇప్పటికే గుర్తించిన స్థలాల్లో లేఅవుట్లను అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.మల్లిఖార్జున, గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ, డ్వామా పీడీ జ్యోతిబసు, నెల్లూరు, కావలి, నాయుడుపేట, ఆత్మకూరు ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, దాస్, సరోజిని, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖలో పోస్టుల భర్తీ

నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా వున్న పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి ఈనెల 22న తెలిపారు. స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో, రేడియోగ్రాఫర్, ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు, కాంట్రాక్ట్ పోస్టుల వివరాలకు sps nellore.ap.gov.in/notice/recruitment వెబ్‌సైట్‌ను, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కార్యాలయంలో సంప్రదించాలని, జూలై 22లోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

# బోర్డర్‌లో బాలయ్య

ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం. చైనాతో సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోంమంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ నుండి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మన్మోహన్‌సింగ్, ఏ.పి సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి, తెలంగాణ సీఎం కేసీఆర్, తమిళనాడు సీఎం పళనిస్వామి, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, డిఎంకె అధినేత స్టాలిన్, బీహార్ సీఎం నితీష్‌కుమార్, పిడిపి అధ్యక్షులు మస్తీ మహబూబా,వామపక్షాల నుండి సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్‌రెడ్డి, బి.వి. రాఘవులు తదితరులు హాజరయ్యారు. అందరూ కాఫీలు తాగాక మోడీ సమావేశం మొదలుపెట్టబోయాడు... అప్పుడు సోనియా జోక్యం చేసుకుని... మీకేమన్నా భయం భక్తి ఉందా... మనుషులంటే లెక్కలేదా అని కోపంగా అంది. ఆ మాటలకు రాజ్‌నాథ్‌సింగ్ షాకై... ఏమైంది మేడం అని అడిగాడు. ఏమి కావడమేంటి, ఇది చైనాతో యుద్ధం సమస్య... రావాల్సినవాళ్ళు రాకుండా, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో దేశాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో చెప్పే వాళ్ళు లేకుండా మీరు మీటింగ్ ఎలా స్టార్ట్ చేస్తారని సోనియాగాంధీ అడిగింది. ఎవరు మేడమ్ అంతటి మేధావులు, మన రాహుల్‌బాబు ఇక్కడే వున్నాడు కదా అని అమిత్‌షా అన్నాడు. అందుకు సోనియా... మీరు అలాంటి వ్యక్తులను విస్మరిస్తుండబట్టే మీ ప్రభుత్వం ఇట్లా ఏడుస్తోంది. వెంటనే చంద్రబాబు గారికి, ఆయన కొడుకు లోకేష్‌కు ఫోన్ చేయండి... వాళ్లొచ్చాకే మీటింగ్ మొదలు పెట్టండి, ఇంతటి ఇంపార్టెంట్ మీటింగ్‌లో వాళ్ళ ప్రెజెంటవడం అవసరం అని చెప్పింది. ఆమె ఆ మాట చెప్పీచెప్పగానే అక్కడ చంద్రబాబు, లోకేష్‌లు ప్రత్యక్షమయ్యారు. చంద్రబాబు నేరుగా వెళ్లి తన సీట్లో కూర్చోగా, లోకేష్ మాత్రం దట్టంగా మూతికి మాస్క్ కట్టి మోచేతితో అందరి మోచేతులను తట్టుకుంటూ(కొత్త అభివాదం) తన సీట్లో కెళ్ళి కూర్చున్నాడు. వాళ్ళు రాగానే మోడీ చైనా సబ్జెక్ట్ లేవనెత్తి.. ఆ చైనావాడు ప్రపంచం మీదకు కరోనాను వదిలాడు... మన మీదకు కరోనాతో పాటు వాళ్ళ సైనికులను కూడా పంపిస్తున్నాడు. ఆ దేశంతో యుద్ధమే రావచ్చు... కాబట్టి ఈ విషయంలో మీ అభిప్రాయాలు కూడా చెప్పమని కోరాడు. ముందుగా వైయస్ జగన్ లేచి... సార్, ఆ కప్పలు, పాములు తినే వాళ్లకే అంతుంటే.. నాటు కోడి పులుసు, మటన్ బిరియానీలు తినే మనకెంత దమ్ముండాలి, చైనా విషయంలో ఏ మాత్రం వెనక్కు తగ్గొద్దు... బుల్లెట్‌కు బుల్లెట్‌తో, బాంబుకు బాంబుతోనే సమాధానం చెప్పాలి అంటూ కూర్చున్నాడు. తెలంగాణ సీఎం కేసీఆర్ లేచి... మోడీ సాబ్, ఆ చైనావోడి నకరాలు ఎక్కువైనయ్... వాళ్ళని తుకడాల్ తుకడాల్ నరకాలే... వాడి బొందపెట్టి, ఒక్కోడికి కోసి ఉప్పు, కారం పెట్టాలి, యుద్ధం చేయాల్సి వస్తే ఏం వెనక్కి తగ్గబల్లేదు భాయ్... అవసరమైతే నేనే స్వయంగా రంగంలోకి దిగుతా... నరుకుతా ఒక్కోడిని అని దగ్గుతూ చెప్పి కూర్చున్నాడు. మమతా బెనర్జీ వుండి... బంగ్లాదేశ్ చొరబాటుదారులకు మా రాష్ట్రంలో రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఇళ్ళ వసతి కల్పించి మా రాష్ట్ర పౌరులుగా చూస్తున్నాం, అట్లాగే భారత దేశంలో చొరబడ్డ చైనా సైనికులకు కూడా ఆధార్, రేషన్‌కార్డులిచ్చి ఇక్కడి పౌరులు గానే గుర్తించండి అని తనదైన శైలిలో చెప్పింది. మాజీ ప్రధానిగా మీ అభిప్రాయమేంటో చెప్పండి అని మన్మోహన్‌సింగ్‌ను కోరాడు మోడీ. దానికాయన సోనియా వైపు చూస్తూ... మేడమ్ ఏం చెబితే అదే నా అభిప్రాయం అన్నాడు. సోనియా వుండి... మా కుటుంబీకులు రాజ్యమేలిననంతకాలం చైనాతో ఇలాంటి సమస్య రాలేదు. ఎందుకంటే చైనా వాళ్ళు ఎంత ఆక్రమించుకుంటే అంత భూమి మావాళ్ళు వదిలేవాళ్ళు. కాబట్టి యుద్ధం అన్న సమస్యే రాలేదు. ఈరోజు మీరు చైనా వాళ్ళ ఆక్రమణను అడ్డుకుంటున్నందు వల్లే ఇలాంటి సమస్యలొస్తున్నాయి. వాడెంత ఆక్రమించుకుంటాడో ఆక్రమించుకోనీయండి, ఆ మంచుకొండలు, లోయలు మనమేం చేసుకుంటాం... వాడి పాపాన వాడే పోతాడనుకుని మనం కళ్లు మూసుకుంటే ఏ సమస్యలూ రావుకదా... అని అంది. అప్పుడు చంద్రబాబు కలుగజేసుకుని... మీరు ఒప్పుకుంటే నేనిప్పుడే బీజింగ్ వెళ్లి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మాట్లాడతాను, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో కూడా మాట్లాడుతాను... యుద్ధవాతావరణం లేకుండా చేస్తాను అని చెబుతుండగా... ఆపండి... అంటూ లోకేష్ గట్టిగా అరిచాడు. దాంతో అందరూ లోకేష్‌వైపు చూశారు. లోకేష్ ముఖంలో ఆవేశం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది, తొక్కలో చైనాను ఎదుర్కోవడానికి ఈ తొక్కలో మీటింగ్‌లు అవసరమా... ఒక బాంబు వేస్తే ఆ చైనా వాళ్లంతా చచ్చూరుకుంటారు అని అన్నాడు. అమిత్‌షా ఉత్కంఠతతో... ఏం బాంబు బాబు అని అడిగాడు. దానికి లోకేష్... మీరు అనుకునే బాంబు కాదులే అంకుల్... నేను అన్నది అణుబాంబు అని చెప్పాడు. ఆ బాంబులు వాడకూడదని మారిటోరియం వుంది బాబు అని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పాడు. అప్పుడు లోకేష్... అట్లాగైతే ఒక పని చేస్తా, మా మామ నందమూరి నటసింహం బాలకృష్ణను బోర్డర్‌లోకి తీసుకెళ్తాను... ఆయన చేత గట్టిగా తొడ కొట్టిస్తాను... ఆ సౌండ్‌కు బోర్డర్‌లో వున్న చైనా సైనికులే కాదు, బీజింగ్‌లో వున్న చైనా అధ్యక్షుడు కూడా గుండాగి చచ్చిపోతాడని చెప్పాడు. అది సాధ్యమయ్యే పనేనా అని నరేంద్ర మోడీ అడిగాడు. దానికి లోకేష్... ఎందుకు సాధ్యం కాదు... ఆయన కన్నెర్ర చేస్తే కల్లోలం... ఆయన మీసం మెలేస్తే భూకంపం.... ఆయన తొడ కొడితే రైళ్లు, విమానాలు కూడా వెనక్కిపోతాయి. ఇలాంటివి ఎన్ని సినిమాల్లో చూళ్లేదు.. అలాంటిది తొడకొట్టి బోర్డర్‌లో చైనా సైనికులకు హార్ట్ ఎటాక్ తెప్పించడం మా మామకు పెద్ద పని కాదన్నాడు. లోకేష్ మాటలతో అక్కడున్న ఇంకెవరికీ నోట మాట రాలేదు.




# మన దేవాలయాలు 1

నేటి ఆధునిక సాంకేతిక యుగంలో మానవ జీవనయానం యాంత్రికంగా సాగిపోతోంది. సాంకేతిక రంగం పట్ల జిజ్ఞాసతో ప్రపంచం పరుగులు పెడుతున్నా మరోవైపు అంతేస్థాయిలో సామాన్యప్రజల్లో ఆధ్యాత్మిక భక్తిభావాల పట్ల ఆకర్షణ.. ఆసక్తి పెరిగిపోతున్నాయి. సోమవారం శివయ్య, మంగళవారం ఆంజనేయస్వామి, బుధవారం గణపయ్య, గురువారం సాయిబాబా, శుక్రవారం అమ్మవారు, శనివారం శ్రీ వేంకటేశుడు, ఆదివారం అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యస్వామి.. తదితర దేవతామూర్తులను ఆరాధించడం ఇటీవలకాలంలో నిత్యకృత్యమైపోయింది. ఇలా వారం రోజులూ ఆ భగవంతుని సేవలో తరించే భక్తుల సంఖ్య రోజురోజుకూ గణనీయంగా పెరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో, మన జిల్లాలోని ఎంతో ప్రాచీనమైన, మరెంతో విశిష్టమైన ఆలయాలు, నేటి ఆధునికకాలంలోనూ వెలసిన ప్రముఖ దేవాలయాలు వాటి ప్రాముఖ్యతను, ఆయా ఆలయాల సంక్షిప్త చరిత్రను ఈ వారం నుంచి.. 'మన దేవాలయాలు' శీర్షికతో వారం వారం 'లాయర్' పాఠకులకు అందిస్తున్నాం.

## కోరిన వరాలిచ్చే తల్లి...

# శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు



కోరిన వరాలిచ్చే చల్లని తల్లి.. భక్తుల పాలిట కల్పవల్లి.. సింహపురి గ్రామ దేవత..శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు.

నెల్లూరు చెరువు గట్టున వెలసివున్న మహా మహిమాన్వితమైన దేవతగా, సింహపురి ప్రజల ఇలవేల్పుగా ప్రసిద్ధి.

శుభకార్యాల్లో తొలి పూజలు అందుకునే బంగరు తల్లిగా, కరుణామూర్తిగా ఇరుకళలమ్మవారు ఎంతో ప్రతీతి.

### ఎంతో పురాతనమైన ఆలయం :



జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోని మూలాపేటలో ఎంతో విశాలమైన స్థలంలో ఉన్న నెల్లూరు చెరువు (స్వర్ణాల చెరువు) గట్టున వెలసివున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎంతో ప్రాచీనమైనది. రైతులకు ప్రాణప్రదమైన ఈ స్వర్ణాల చెరువును కాకతీయ గణపతి దేవ చక్రవర్తి నిర్మించాడని ప్రతాపరుద్ర చరిత్ర పేర్కొంటోంది. క్రీస్తుశకం 10వ శతాబ్ది నాటికే ఇక్కడ ఈ ఆలయం ఉన్నట్లు పురావస్తు శాఖ అంచనా. ఆ కాలంలోనే బొంతరాళ్ళతో ఈ ఆలయాన్ని అత్యద్భుతంగా నిర్మించడం చూస్తే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. ఆలయ స్తంభాలపై, దూలాలపై ఈ నిర్మాణానికి సంబంధించిన శాసనాలు కూడా ఉన్నాయి. ఆలయ మండపంలోను స్తంభాలపైన తెలుగు, తమిళ, దేవనాగరి భాషల్లో ఉన్న శాసనాలను దేవాలయ నిర్మాణానికి సంబంధించిన చారిత్రక అంశాలను తెలుపుతున్నాయి.

మరొక శాసనం ప్రకారం.. విజయనగర సామ్రాజ్య ప్రతినిధిగా ఉదయగిరిని పాలిస్తూ సావణ్ణ ఒడియలు కాలం(1364-65)లో 'కాంచణం గారు' అనే ఆయన ప్రతి శుక్రవారం ఈ ఆలయం వద్ద సంత ఏర్పాటుచేశాడని, దేశవిదేశాల నుంచి వర్తకులు ఈ సంతకు వచ్చేవారని, ఇక్కడ అనేకరకాల వస్తుసామగ్రిని విక్రయించేవారని, వర్తకుల నుండి వసూలయ్యే వర్తక సుంకాల మొత్తంలో కొంత భాగాన్ని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఇచ్చేట్లుగా కట్టడి చేశాడని తెలుస్తోంది. ప్రాచీనకాలం నుంచి నేటి కాలం దాకా ఈ ఆలయం భక్తులను ఆకట్టుకుంటూనే ఉంది.

### ప్రతినిత్యం పూజలు.. విశేష అలంకారాలు :

అమ్మవారి ఆలయంలో ప్రతినిత్యం పూజలు, విశేష అలంకారాలు జరుగుతూనే ఉంటాయి. మంగళవారం, శుక్ర, ఆదివారం రోజుల్లో ఉదయం 7 గంటలకు అభిషేకం జరుగుతుంది. వస్త్రాలంకరణ సేవతో పాటు, పూలంగిసేవ, పల్లకిసేవ ప్రతిరోజూ ఎంతో కన్నులపండువగా జరుగుతుంటాయి. ప్రత్యేకించి పండుగల రోజుల్లో అమ్మవారికి విశేష పూజలు ఉంటాయి. ఉగాది పర్వదినం రోజున నగరోత్సవం, నవరాత్రి వేడుకలు వగైరాలు ఎంతో శోభాయమానంగా జరుగుతుంటాయి.

- కాలధర్మం

# శ్రీమతి కోటంరెడ్డి సరళమ్మ







నెల్లూరు రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తల్లి శ్రీమతి కోటంరెడ్డి సరళమ్మ జూన్ 19వ తేదీ శుక్రవారం సాయంత్రం పరమపదించారు. ఆమెకు శ్రీధర్, గిరిధర్ ఇద్దరు కుమారులు. శనివారం 20వతేదీ వారి స్వగ్రామం పడమటిపాలెంలో అంత్యక్రియలు జరిగాయి.

**ప్రముఖుల నివాళి**

ఆమె మరణవార్త తెలిసిన వెంటనే జిల్లాలోని ప్రముఖులు, నాయకులు, పలువురు ఉన్నతాధికారులు శ్రీధర్‌రెడ్డిని పరామర్శించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్‌తో పాటు ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా సహకార బ్యాంక్ ఛైర్మెన్ ఆనం విజయ కుమార్‌రెడ్డి, వైకాపా నాయకుడు రూప్ కుమార్‌యాదవ్, టిడిపి నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, అబ్దుల్ అజీజ్, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, ఆనం వెంకట రమణారెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, మాజీ మేయర్ భానుశ్రీ, సిపిఎం నాయకులు చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకుడు పముజుల దశరధరామయ్యతో పాటు జిల్లా కలెక్టర్ ఎంవిశేషగిరిబాబు, కార్పొరేషన్ కమిషనర్ బాపిరెడ్డి, పలువురు అధికారులు సంగం మండలంలోని పడమటిపాలెంలో ఉన్న శ్రీధర్‌రెడ్డి నివాసానికి వెళ్ళి ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. శ్రీధర్‌రెడ్డిని, వారి కుటుంబసభ్యులను ఓదార్చారు.

**శ్రీధర్‌రెడ్డిని పరామర్శించిన విపిఆర్**

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఈ నెల 24వ తేదీ బుధవారం రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. శ్రీధర్‌రెడ్డి మాతృమూర్తి మరణానికి తన సంతాపం వ్యక్తం చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## ఉపరాష్ట్రపతి వెంకయ్య, సిఎం జగన్‌ల సంతాపం

భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాతృమూర్తి సరళమ్మ మరణం పట్ల సంతాపం తెలియజేశారు. ఆమె అకాలమరణం బాధాకరమని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ శ్రీధర్‌రెడ్డి కుటుంబసభ్యులకు తన సానుభూతిని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధరరెడ్డికి ఫోన్‌చేసి పరామర్శించారు. శ్రీధర్‌రెడ్డి మాతృమూర్తి మరణానికి తన సంతాపం తెలియజేశారు.

# గుట్కా.. గుట్టు రట్టయింది

- టమోటాల మాటున.. కావలికి గుట్కా ప్యాకెట్లు
- అయిదుగురు అరెస్ట్



***జిల్లాలో నిషేధిత గుట్కాల వ్యాపారం జోరుగా సాగుతోంది. తాజాగా కావలిలో పోలీసులు చేసిన తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. టమోటా మూటలను వాహనాల్లో వేసుకుని వాటి చాటున గుట్కా ప్యాకెట్లను పెట్టుకుని కావలికి తెచ్చి అమ్ముకుంటూ విక్రేతలు లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్న వైనం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారానికి సంబంధించి అయిదుగురిని కావలి పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ ఈనెల 20న విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆ వివరాలు తెలియజేశారు.***

బెంగుళూరు నుంచి టమోటా లోడ్‌తో పాటు నిషేధిత గుట్కా ప్యాకెట్లు కూడా కొందరు వ్యాపారులు సైగ్గా తీసుకొచ్చేసి కావలిలో విచ్చలవిడిగా అమ్ముకుంటున్నారు. ముందుగా ఒకరిని పట్టుకోగా, ఆయన్నుంచి ఈ వ్యవహారంలో ఉన్న వారందరి లింకులు బయటపడడంతో నిందితులందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొదట కావలిలోని షేక్ జానీబాషా అనే వ్యక్తి నిర్వహిస్తున్న దుకాణంలో పోలీసులు తనిఖీ చేయగా, అక్కడ 7300 రూపాయలు విలువజేసే గుట్కాప్యాకెట్లు దొరికాయి. దీంతో ఈ వ్యవహారం ఎంతదాకా ఉందో పోలీసులు తీగ లాగారు. జానీబాషాను పోలీసులు విచారిస్తే కావలి మండలంలోని మద్దూరుపాడు గ్రామానికి చెందిన మహేష్, ఆయన అన్న మల్లికార్జున వారి బొలెరో వాహనంలో నిషేధిత గుట్కాలను బెంగుళూరు నుంచి టమోటా లోడ్ మాటున దిగుమతి చేసుకుని వాటిని రిటైల్ వ్యాపారులకు అమ్ముకుంటున్నట్లు తెలిసింది. దీంతో పోలీసులు వారి గోడౌన్‌పై దాడి చేసి 22వేల రూపాయల విలువజేసే గుట్కాలను స్వాధీనంచేసుకుని మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యాపారానికి సంబంధించి 41.38 లక్షల రూపాయల నగదును కూడా స్వాధీనం చేసుకుని మహేష్‌ను విచారించి గుట్కాలు ఎక్కడి నుంచి ఎలా వస్తున్నాయో సమాచారం రాబట్టారు. అయితే మల్లికార్జున, బొలెరో వాహనం డ్రైవర్ అరుణ్‌కుమార్ పరారీలో ఉండడంతో వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదే క్రమంలో మల్లికార్జున వద్ద నుంచి 8,600 రూపాయల విలువజేసే గుట్కాలను తీసుకునేందుకు వచ్చిన ఏయస్‌పేట మండలం చిరమన గ్రామానికి చెందిన నాగేశ్వరరావును కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత నిందితులందరినీ అరెస్ట్ చేశారు. గుట్కాల గుట్టును అత్యంత చాకచక్యంగా రట్టుచేసి నిందితులను అరెస్ట్ చేసిన కావలి డిఎస్పీ ప్రసాద్, కావలి 1వ పట్టణ ఇన్స్‌పెక్టర్ కె.శ్రీనివాసరావు, సిబ్బందిని జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ అభినందించారు.



# నెల్లూరు కవికి 'తానా' బహుమతి

నెల్లూరుకు చెందిన కవి, విశ్రాంత ఉపాధ్యాయుడు బొగ్గరపు రాధాకృష్ణమూర్తికి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) వారు నిర్వహించిన ప్రపంచస్థాయి కవితల పోటీలో ప్రోత్సాహక బహుమతి లభించింది. గతనెల 21న పితృదినోత్సవం సందర్భంగా తానా వారు ఈ పోటీ నిర్వహించారు. రాధాకృష్ణమూర్తి రాసిన 'నేను చూసిన నాన్న' అనే కవితకు బహుమతి లభించడం పట్ల స్థానిక ప్రముఖులు ఆచార్య ఆదిత్య, కవులు చిన్ని నారాయణరావు, డా. గంగిశెట్టి శివకుమార్ తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తానా అధ్యక్షులు తాళ్ళూరి జయశేఖర్, నిర్వాహకులు డా.ప్రసాద్ తోటకూర, సమన్వయకర్త చిగురుమళ్ళ శ్రీనివాస్‌లకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రభుత్వానికి కోర్టులు వ్యతిరేకం అనే అభిప్రాయం...

# ఎవరికీ మంచిది కాదు

- సమన్వయ లోపాన్ని సరిదిద్దుకోవాలని సూచించిన హైకోర్టు



***ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రభుత్వం తరపున న్యాయవాదులు సరైన విధంగా గైడ్ చేయడంలేదని, ప్రభుత్వ న్యాయవాదుల వ్యవహారశైలి కారణంగా హైకోర్టు ప్రభుత్వానికి వ్యతిరేకం అనే అభిప్రాయం ప్రజల్లోకి వెళుతోందని, ఇది ఎవరికీ మంచిది కాదని హైకోర్టు తాజాగా స్పష్టం చేసింది. సమన్వయ లోపాన్ని సరిదిద్దుకుని న్యాయస్థానం ప్రతిష్టను పెంచేలా వ్యవహరించాలని హితవు పలికింది.***

ప్రభుత్వానికి సలహాదారులు న్యాయపరమైన సూచనలు సరిగా ఇవ్వని కారణంగా ఉన్నతాధికారులు న్యాయస్థానాల్లో నిలబడాల్సివస్తోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈనెల 24న కోర్టుకు హాజరైన డిజిపి గౌతం సవాంగ్‌ను ఉద్దేశించి హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేయడం అధికారవర్గాల్లో సంచలనం కలిగించింది. ఈ చిన్న కేసులో మిమ్మల్ని పిలిపించాల్సి వచ్చిందంటే పరిస్థితి అర్థం చేసుకోవాలని హైకోర్టు ఈ సందర్భంగా డిజిపిని కోరింది. అంతేకాదు, 'మీ నిబద్ధత గురించి తెలుసునని, ఈ కేసులోనూ మీకు న్యాయసలహా సక్రమంగా ఇవ్వకపోవడంతోనే మీరు ఇక్కడ నిలబడాల్సి వచ్చిందని' హైకోర్టు పేర్కొంది.

న్యాయ సలహాదారులు రాష్ట్రప్రభుత్వానికి సరైన సలహాలు ఇవ్వడం లేదని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టుకు సైతం న్యాయసలహాదారులు సరిగ్గా సహకరించడం లేదని, న్యాయస్థానాలకు తగిన రీతిలో స్పందించకపోవడం వల్లే తాము జోక్యం చేసుకోవాల్సి వస్తోందని స్పష్టం చేసింది.

కొందరు ప్రభుత్వానికి న్యాయస్థానం వ్యతిరేకమా అనే భావనలో ఉన్నారని, అయితే కోర్టులున్నది రాజ్యాంగ, చట్ట నిబంధనల రక్షణకోసమేనని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ప్రభుత్వానికి సక్రమమైన సలహాలు, సూచనలు చేయకుండా కోర్టులను నిందిస్తే ప్రయోజనం ఉండదని కూడా పేర్కొంది. ప్రభుత్వ న్యాయవాదులు, ఏజీపీలు న్యాయస్థానం ప్రతిష్టను పెంచేలా వ్యవహరించాలని హితవు పలికింది. ఏ వ్యక్తికి, అధికారికి, ఏ ప్రభుత్వానికి న్యాయస్థానాలు వ్యతిరేకం కాదని, ఆశ్రయించినవారికి న్యాయం చేయడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోర్టుల విధి అని స్పష్టం చేసింది. కరోనా సమయంలో పోలీసులు చాలా చక్కగా సేవలందిస్తున్నారని కితాబిచ్చింది. అయితే చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను నష్టపరిచేలా వ్యవహరించేవారిని ఉపేక్షించాల్సిన అవసరం లేదని పేర్కొంది.

నిబంధనలకు లోబడి 3 లేదా అంతకంటే తక్కువ మద్యం బాటిళ్ళు తీసుకెళ్తున్నప్పటికీ పోలీసులు తమ వాహనాల్ని జప్తు చేశారని, వాటిని విడుదల చేసేలా ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలైన నేపథ్యంలో, వీటిని విచారించిన జస్టిస్ దేవానంద్ ఈనెల 24న పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎక్సైజ్ చట్టంలోని సెక్షన్46, సిఆర్‌పిసి సెక్షన్ 102 ప్రకారం పోలీసులు ఎందుకు నడుచుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాలను మెజిస్ట్రేట్ లేదా ఎక్సైజ్ డిసి ముందుంచకపోవడాన్ని తప్పు పట్టారు. వాహనాల్ని సీజ్ చేసిన అధికారులు చట్ట నిబంధనలను ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. దీనిపై డిజిపి హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించడంతో డిజిపి కోర్టుకు హాజరై వాహనాల్ని ఎక్సైజ్ డిసి ముందుంచే విషయమై కిందిస్థాయి అధికారులకు సర్క్యులర్ జారీ చేశామని ప్రమాణపత్రం దాఖలు చేశారు. ఈ సందర్భంలో హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ పోలీసు శాఖకు చెందిన కొందరు దిగువస్థాయి అధికారులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు చట్ట నిబంధనలు పాటించడం లేదని, విధి నిర్వహణలో వారు విఫలమవుతున్నారని ఆక్షేపించారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను కేసు రికార్డులతో సహా ఈనెల 24 నుంచి మూడురోజుల్లోపు సంబంధిత ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ముందుంచాలని తేల్చి చెప్పారు. ఆ వాహనాలు డిసి ముందుకు చేరగానే యజమానులు వాటి కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని, దరఖాస్తులు అందిన మూడురోజుల్లోపు నిబంధనల ప్రకారం వాహనాల విడుదలపై ఉత్తర్వులు జారీ చేయాలని డిసిని ఆదేశించారు. వారంలోగా ఈ ప్రక్రియనంతా పూర్తిచేయాలని పేర్కొంటూ ఇందులో డిజిపిని హాజరు నుంచి మినహాయింపునిస్తూ... ఈ వ్యాజ్యాలన్నింటినీ పరిష్కరించి హైకోర్టు అందరి ప్రశంసలు అందుకుంది.

# ముక్కాలకు అభినందన



ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా ఎంపికైన ముక్కాల ద్వారకానాథ్‌ను ఏపీ ఆర్య వైశ్య మహాసభ మాజీ కార్యదర్శి కెవి చలమయ్య ఈనెల 25న సత్క రించారు. ఈ సందర్భంగా చల మయ్య మాట్లాడుతూ ఏపీ ఆర్యవైశ్య మహాసభ ప్రారంభించి 115 సంవత్సరాలైందని, ఈ మహాసభకు ఎంతో మంది ప్రముఖులు అధ్యక్షు లుగా వ్యవహరించారని, వారిలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, మాజీ గవర్నర్ గల్లా నారాయణశెట్టి తదితరులు ఉన్నారన్నారు. నెల్లూరు జిల్లాలో ఇంతవరకు ఏపీ మహాసభకు అధ్యక్షులుగా ఎవరూలేరని, నెల్లూరు ప్రముఖులు సాధించలేనిది ముక్కాల ద్వారకానాథ్ సాధించారని ఆయన్ను మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నానన్నారు. రాజకీయాల్లో కూడా మంచి పేరు, పదవులు సాధించాలని ఆశిస్తున్నానన్నారు. ఐరన్ మర్చంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నగరగంటి రవీంద్రనాథ్, నగరగంటి రాకేష్, కార్యవర్గ సభ్యులు ఆర్ వి శరత్, సోమిశెట్టి వెంకటరత్నం తదితరులు ముక్కాలను సత్కరించారు. కడప వాస్తవ్యులు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం మాజీ అధ్యక్షులు కోట నరశింహులు, సరాబు సుబ్రహ్మణ్యం, మణి పాల్గొన్నారు.

## కర్నల్ సంతోష్‌బాబుకు విఎస్‌యు ఘన నివాళి

చైనా సైనికుల దాడిలో వీరమరణం పొందిన కర్నల్ సంతోష్‌బాబుకు నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ సుదర్శన్‌రావు ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. ఈనెల 23న విఎస్‌యులో జరిగిన కార్యక్రమంలో కర్నల్ సంతోష్‌బాబు మరణానికి విచారం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సంతోష్‌బాబు త్యాగం దేశచరిత్రలో నిలిచిపోతుందని వైస్‌చాన్సలర్ ఈ సందర్భంగా కొనియాడారు. విఎస్‌యు రెక్టార్ చంద్రయ్య, రిజిస్ట్రార్ ఎల్.విజయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## రాజ్యాంగ వ్యవస్థలు రచ్చకెక్కుతున్నాయి

(మొదటి పేజీ తరువాయి)

తాను ఎప్పుడు ప్రతిపక్షంలో వున్నా వ్యవస్థలను అడ్డుపెట్టుకుని అధికార పక్షాన్ని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చెయ్యడం బాబుకి అలవాటే. ఆ అలవాటులో భాగంగానే ఇప్పుడు తన వ్యూహంలో సాక్షాత్తు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని అడ్డంపెట్టుకుని పావులు కదిపాడు. అయితే చంద్రబాబు నక్కజిత్తుల వ్యవహారాలను బాగా అధ్యయనం చేసిన జగన్, వెంటనే స్పందించి ఘాటైన విమర్శలు చేయడంతో పాటు రమేష్‌కుమార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడడంతో బాబు గొంతులో వెలక్కాయ పడ్డట్టుగా మారింది. తాను తలచింది ఒకటైతే.. జరిగింది మరొకటి కావడంతో సీన్ రివర్స్ అయ్యింది. అయితే ఇలాంటి కుట్రలు చేయడంలో తనకున్న అనుభవం చాలా ఎక్కువే కాబట్టి అక్కడితో ఆగక, వ్యవహారాన్ని సుప్రీం కోర్టు వరకు లాగి అక్కడ తన బలాన్ని, బలగాన్ని ఉపయోగించి జగన్‌పై ప్రయోగించి తాత్కాలిక ఉపశమనం పొందగలిగాడు.

ఈ వ్యవహారంలో సుప్రీం రెండు వారాల వ్యవధిని ఇరువర్గాల వారికి ఇవ్వడంతో కింకర్తవ్యం అన్నట్లుగా తన డైరెక్షన్‌లో బీజేపీలో చేరిన సుజనా చౌదరి ద్వారా బాబు తన పనిని చక్కబెట్టాలని చూసినట్టుంది పాపం, పార్క్ హయత్ హోటల్ వేదికగా జరిగిన వీరి మంతనాల వ్యవహారం సిసి కెమెరాల ఫుటేజ్ ద్వారా వెలుగులోకి రావడంతో అసలు భాగోతం బట్టబయలయ్యింది.

ఎలెక్షన్ కమిషనర్ స్థాయిలో ఉండి ఓ వైపు విమర్శలను ఎదుర్కుంటూ వివాదస్పద వ్యక్తిగా పేర్కొనబడుతున్న ఒక ఐఏఎస్ అధికారి, ఇలాంటి తరుణంలో 5 నక్షత్రాల హోటల్‌కి వెళ్లి భారతీయ జనతా పార్టీ నాయకులను కలవడంలోని ఆంతర్యమేమిటో అయనే సమాధానం చెప్పుకోవాలి. రాజకీయ నేతలను కలిశారన్న వార్తలపై వివరణ ఇచ్చుకోవాలి. ఆయన తగిన వివరణ ఇవ్వకపోతే తన రక్షణకు సంబంధించి కేంద్రానికి రాసిన లేఖ ఎంత వివాదంగా మారిందో ఇప్పుడు అదే జరుగుతుంది. ఇలాంటి పరిణామాల వల్ల రాజకీయ పార్టీలకు ప్రయోజనం కలగవచ్చునేమో కానీ ఎన్నికల కమిషన్ ప్రతిష్టకు మాత్రం విఘాతం కలుగుతుంది.

ఈ సంఘటనపై వైసిపి ఫైర్ బ్రాండ్లు అంబటి రాంబాబు, రోజా, విజయసాయిరెడ్డిలు తీవ్రంగానే స్పందించారు. గది లోపల ఏం జరిగింది... నిమ్మగడ్డ ఫేస్‌టైమ్ కాల్‌లో ఎవరితో మాట్లాడింది, దుష్ట చతుష్టయం చేస్తున్న కుట్రలేమిటి అన్నది త్వరలోనే బయట పెడతామంటూ సాయిరెడ్డి ట్వీట్ చేశాడు. నిమ్మగడ్డని వెంటనే అరెస్టు చెయ్యాలి అంటూ అంబటి ధ్వజమెత్తాడు, అంతా దొంగలు అంటూ మరికొంతమంది మాట్లాడారు.

ఏది ఏమైనా ఇది చాలా విచారకరమైన సంఘటన, తాము చేసే కుళ్ళు రాజకీయాల కోసం, తమ స్వార్ధ ప్రయోజనాల కోసం రాజ్యాంగ వ్యవస్థల పరువును తాకట్టుగా పెట్టడం నీచమైన, నీతిమాలిన విషయం. తెలివి, తెగువ ఉంటే అధికార పక్షాన్ని నేరుగా ఎదుర్కోవాలి. ఇలా అడ్డదారిలో అక్రమ మార్గంలో వెళ్లి తమ నికృష్ట రాజకీయాల కోసం రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టు పట్టించడం క్షమించరాని నేరం.

ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన రాజ్యాంగ వ్యవస్థలపైన ప్రజలకు అపార నమ్మకం, విశ్వాసం వున్నాయి. ఇలా సొంత లాభం కోసం ఆ వ్యవస్థల పరువును తాకట్టుపెట్టే పని చంద్రబాబు లాంటి రాజకీయ నాయకులు చేసినా, రమేష్‌కుమార్ లాంటి ఐఏఎస్ అధికారులు చేసినా చరిత్ర హీనులుగా మిగిలిపోతారు.

## ఏసీ వేగూరుకి సన్మానం

దేవదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి ఈ నెలాఖరులో ఉద్యోగ విరమణ పొందనున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 24న నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని ఆయన నివా సంలో పలువురు సన్మానించారు. శ్రీశైల దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యుడు ఆల్తూరు గిరీష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ ఆలయాల ఇవోలు ఆయనకు జ్ఞాపికలను అందజేశారు. పెంచలకోన లక్ష్మీనరశింహ స్వామి దేవస్థాన పాలకమండలి మాజీ ఛైర్మన్ రవీంద్రరెడ్డి, కనుపూరు ముత్యా లమ్మ దేవస్థానం ఇఓ కోవూరు జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాత్సల్య విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

నెల్లూరు కొండాయపాళెం సెంటర్ లోని జనహిత వాత్సల్య ఆశ్రమంలో చదువుకుంటున్న పదవ తరగతి విద్యా ర్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం ( ఏపీజీఈఏ) జిల్లానేత చేజర్ల సుధాకర్‌రావు ఆధ్వర్యంలో మెటీరియల్, పరీక్ష సామగ్రిని ఈనెల 24 న పంపిణీ చేశారు. వైద్యశాఖలోని డిప్యూటీ డెమో అధికారి ధర్మేంద్ర సహకారం అందిం చారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మధుసూదనరెడ్డిని ఏపీజీఈఏ నేతలు సన్మానించారు. కనకరత్న, హరిబాబు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జూలై 8న రాజన్న పుట్టినరోజున..

# ఇళ్ల స్థలాలు

### జిల్లాలో లక్షా 79వేల మంది లబ్దిదారులకు సిద్ధమవుతున్న ప్లాట్లు



దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి పుట్టినరోజైన జులై 8న రాష్ట్రంలోని అర్హులందరికీ ఇళ్ళస్థలాలను పంపిణీ చేసే బృహత్తర కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుడుతున్నారు. ఉండడానికి ఇల్లు లేక జీవితాంతం బాధలు పడుతున్న పేదల కలలు సాకారం అయ్యే రోజు అత్యంత సమీపంలోనే ఉంది. పేదల కలలను సాకారం చేసే దిశలో ముఖ్యమంత్రి చేపడుతున్న ఈ కార్యక్రమం పట్ల రాష్ట్రంలోని పేదవర్గాల్లో సంతోషం వెల్లువెత్తుతోంది. ఈనెల 23న సిఎం అమరావతిలోని సచివాలయం నుంచి ఈ విషయమై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇళ్ళ పట్టాల పంపిణీపై జిల్లా కలెక్టర్, ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్ ఈ సందర్భంగా స్పష్టంగా ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు మాట్లాడుతూ, జిల్లాలో 1.79 లక్షల మంది లబ్దిదారులకు ఇళ్ళ పట్టాలు ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఇందులో 46 వేల మందికి టిడ్‌కో కింద నిర్మించిన ఇళ్ళను, స్థలాలను అందజేయనున్నామని చెప్పారు. ఇప్పటికే 1.32 లక్షల ప్లాట్ల ఏర్పాటు పూర్తయిందని, నెల్లూరుకు సంబంధించి 120 ఎకరాల్లో ప్లాట్ల ఏర్పాటు పూర్తిచేశామని వివరించారు. కావలిలో కూడా ఇళ్ళ పట్టాల ఏర్పాటుకు సంబంధించిన పనులు పూర్తిచేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ భాస్కరభూషణ్, జేసీలు వి.వినోద్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ సిఇఓ సుశీల తదితరులు పాల్గొన్నారు.

## మంత్రివర్గంలో మార్పులు?

(మొదటి పేజీ తరువాయి)

ఊపందుకుంటున్నాయి. అదే సమయంలో తొలి కేబినెట్‌లో చోటు దక్కని ఆశా వహులు కూడా తమను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం జగన్‌కు విజ్ఞాపనలు పంపుతున్నారు.

ఈ క్రమంలోనే కొత్తవాళ్ళని ఇద్దరిని తీసుకోవడంతో పాటు పలువురి శాఖల మార్పు కూడా ఉండే అవకాశం ఉందన్నది ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాల సమా చారం. రెవెన్యూశాఖ బాధ్యతలు చూస్తోన్న బోస్ ఉప ముఖ్యమంత్రి కూడా కావడంతో ఆ ఉప ముఖ్యమంత్రి పదవిని నీటి పారు దల శాఖ మంత్రి అనీల్‌కి ఇచ్చి శాఖ మార్పు కోరుకుంటోన్న గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖామంత్రి పెద్దిరెడ్డికి రెవెన్యూశాఖను కట్టబెడుతున్నారన్న సమాచారం కూడా ఉంది.

### అనిల్‌యాదవ్‌కి డెప్యూటీ సీఎం?

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అత్యంత విశ్వాసపాత్రులుగా, విధేయు లుగా గుర్తింపు పడ్డ నెల్లూరు నగర ఎమ్మెల్యే, నీటిపారుదల శాఖా మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్‌కి పదోన్నతి కలుగబోతోందన్నది కూడా అత్యంత విశ్వసనీయ సమాచారం. త్వరలో అనిల్‌కుమార్‌యాదవ్ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి హోదాలో తన మంత్రివర్గ బాధ్య తలు నిర్వర్తించనున్నారని, దీనిపై నిర్ణయం అయిపోయిందని, ఇక ప్రకటించడమే తరువాయి అన్నది అధికార పార్టీ పెద్దల సమాచారం. ఇది నెల్లూరుజిల్లాకి, ముఖ్యంగా నెల్లూరు పట్టణానికి అత్యంత శుభవార్తగానే చెప్పాలి. ఇప్పటివరకు నెల్లూరు జిల్లాకు ఉప ముఖ్యమంత్రి పదవి రాకపోగా, మొట్టమొదటిసారి మంత్రి అయిన బలమైన బీసీ నేత అనిల్‌కుమార్ యాదవ్ ఇకపై ఏకంగా ఉపముఖ్యమంత్రి కాబోతున్నారని చక్కర్లు కొడుతున్న వార్త నగరంలో అందరిలో సంతోషం నింపుతోంది.

అయితే శెట్టి బలిజ కులానికి చెందిన పిల్లి స్థానంలో మళ్లీ అదే సామాజిక వర్గా నికి మంత్రి పదవి ఇవ్వాలంటే మాత్రం కృష్ణా జిల్లా పెడన శాసనసభ్యుడు జోగి రమేష్‌కి అవకాశం ఉంటుంది. అయితే కృష్ణా జిల్లాలో ఇప్పటికే ముగ్గురికి మంత్రి పదవులు ఉన్నందున తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం శాసనసభ్యుడు పొన్నాడ సతీష్‌కి మంత్రి పదవి ఇస్తే అత్య ధిక నియోజకవర్గాలు ఉన్న తూర్పుగోదా వరికి ప్రాధ్యాన్యత ఇవ్వడమే కాకుండా సతీష్, మోపిదేవి సామాజికవర్గమైన మత్స్య కారులే కావడంతో రెండు సమీకరణలను ఒకేసారి సరి చేసినట్లుంటుందన్నది ఒక కీలకమైన విశ్లేషణ. అలాగే జోగి రమేష్‌కి ఏదైనా ఛైర్మన్ పదవి ఇచ్చి క్యాబినెట్ ర్యాంక్ ఇస్తే ఆ సామాజిక వర్గాన్నీ బాలన్స్ చేయొచ్చన్నది వివరణ.

ఇక రెండో మంత్రి పదవి విష యంలో ఎక్కువగా వినిపిస్తోన్న పేరు నగరి శాసనసభ్యురాలు, ఏపీఐఐసీ ఛైర్మన్ ఆర్‌కె రోజా. రోజాకి తొలి క్యాబినెట్‌లోనే మంత్రి పదవి దక్కాల్సి ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వారిలో జగన్మోహన్‌రెడ్డి కుటుంబం తరు వాతి వరుసలోని మొదట ఐదుమందిలో రోజా కూడా ఒకరని అంటుంటారు. అంతటి విధేయత, విశ్వసనీయత కలిగిన రోజాకి పదవి ఇవ్వకపోతే మంచి సంకే తాలు వెళ్లవన్న ఆలోచనా పార్టీ పెద్దల్లో ఉంది. అందులోనూ అన్ని విషయాల్లోనూ సమర్థత కలిగిన నేతగా పేరొందిన రోజా పేరు బలంగా వినిపిస్తోంది. పెద్దిరెడ్డికి రోజాకి మధ్య సమన్వయ లోపం కొంత ఉంది అన్నట్లు వార్తలు వచ్చినా, ముఖ్య మంత్రి జోక్యం చేసుకుంటే అవేమీ పెద్ద సమస్యలు కూడా కాకపోవచ్చు. అందుకే పెద్దిరెడ్డికి రెవెన్యూ లాంటి పదవితో ప్రమోట్‌చేసి రోజాను మంత్రివర్గంలోకి తీసుకువస్తే బాగుంటుందని కొందరు చేస్తోన్న సూచనలను ప్రభుత్వ పెద్దలు కూడా సీరియస్‌గానే తీసుకుంటున్నట్లు సమాచారం.

వీరితో పాటు మరికొందరి పోర్ట్ ఫోలియోలూ మారుతుండగా, ఉత్తరాం ధ్రకు చెందిన ఓ మంత్రిని తొలగించాలన్న ఆలోచనలో కూడా ముఖ్యమంత్రి ఉన్నట్లు సమాచారం. ఇటీవల అక్కడ చోటుచేసు కున్న వివాదాల్లో భాగమైన మంత్రిని పిలిచి తీవ్రంగా చీవాట్లు పెట్టిన ముఖ్య మంత్రి ఆ మంత్రిని మార్చివేయాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.

పొలిటిక్స్ చాలా డైనమిక్‌గా ఉం టాయ్ కాబట్టి చివరి క్షణంలో ఏ టర్న్ అయినా తీసుకుని ఎవర్నైనా పదవి వరించే అవకాశం ఉండడంలో ఎలాంటి సం దేహం లేదు. ఈలోపు ఈ పదవుల భర్తీ, పోర్టుఫోలియోల మార్పుపై ఇంకా అనేక వార్తలు వచ్చే అవకాశం ఉంది.

# నిమ్మ పంటకు కరోనా దెబ్బ

- మార్కెట్ల మూతతో దిక్కుతోచని రైతులు
- అరాకొరా విక్రయాలతోనే సరి



కరోనా మహమ్మారి వ్యాధి అందరినీ ఏదోఒక విధంగానే బాధిస్తూనే ఉంది. చివరికి తోటల రైతాంగంపై కూడా దాని ప్రభావం బాగా పడింది. కరోనా, లాక్‌డౌన్‌లతో రవాణా లేక, మార్కెట్లు లేక నిమ్మ కాయల విక్రయాలు బాగా తగ్గిపోవడంతో జిల్లాలో నిమ్మరైతులు నష్టాల పాలవుతున్నారు. ఆరుగాలం కష్టపడి శ్రమించి నిమ్మతోటలను కంటికి రెప్పలా కాపాడుకున్నా చివరికి నష్టాలే మిగులుతున్నాయి. మరోవైపు.. నిమ్మకాయల దిగుబడి బాగున్నా.. కొనేవారు లేరంటూ రైతులు బాధపడిపోతున్నారు.

జిల్లాలోని నిమ్మరైతులకు ప్రతి ఏడాదీ ఏదో ఒక కష్టం వస్తూనే ఉంది. ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బందులు ఏటా వస్తూనే ఉంటాయి. ఆ సమస్యలను అధిగమిస్తూనే ఎలాగో ఈసారి రైతులు పంట బాగా పండించుకున్నా కరోనా వ్యాధి విరుచుకుపడదంతో రవాణా సౌకర్యాల లేక ఎగుమతులు సన్నగిల్లిపోయి నిమ్మ రైతులు మళ్ళీ కష్టాల్లోపడిపోయారు.

ఎంతో నాణ్యమైన నిమ్మకాయలకు మన జిల్లా ప్రసిద్ధి. జిల్లాలో ప్రతి ఏడాది వేలాది హెక్టార్లలో నిమ్మ పంట సాగువుతూ ఉంటుంది. అందులోనూ ఈ సీజన్‌లో నిమ్మకాయలు బాగా పండి ఇతర ప్రాంతాలకు కూడా భారీగానే ఎగుమతి అవుతుంటాయి. ప్రధానంగా జిల్లాలోని గూడూరు, పొదలకూరు, రాపూరు మనుబోలు, వెంకటగిరి, సైదాపురం, డక్కిలి, బాలాయపల్లి, ఓజిలి, చేజర్ల, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో నిమ్మతోటలు విస్తారంగా ఉన్నాయి. జిల్లాలో మొత్తంగా సుమారు 17 వేల హెక్టార్లకు పైగానే నిమ్మ పంట సాగవుతున్నట్లు అంచనా. ఈ సీజన్‌లో సాధారణంగా ప్రతిరోజూ సుమారు 150 టన్నుల దాకా దిగుబడి ఉంటుంది. అందులోనూ ఈసారి వర్షాలు బాగానే కురవడంతో నిమ్మపంట దిగుబడులు బాగానే వచ్చాయని, ధరలు కూడా బాగానే ఉంటాయని సంతోషపడుతున్న సమయంలో కరోనా వచ్చి మార్కెట్లలో పరిస్థితి సక్రమంగా లేక, ధరలు తగ్గిపోవడంతో.. తమ పరిస్థితి దయనీయంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గిట్టుబాటు ధరలు లేక దిగాలు :


గత ఏడాది నిమ్మకాయల బస్తా ధర 16 వేల దాకా ఉంటే ఇప్పుడు అది 400 నుంచి 700 రూపాయల లోపే ఉంటోందని, ఈ పరిస్థితుల్లో పెట్టిన పెట్టుబడులు చేతికి రాక ఇబ్బందులు పడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో నిమ్మకాయలకు మంచి సీజన్ అనీ, అయితే దురదృష్టవ శాత్తూ ఆ సీజన్‌లోనే కరోనా మహమ్మారి వచ్చిపడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## చెట్లకే కాయలను వదిలేసే దుస్థితి :

నిమ్మపంట దిగుబడి బాగున్నా, ఎగుమతులు లేక, స్థానికంగా కొనేవారు లేక కాయలను చెట్లకే వదిలేస్తున్న దయనీయస్థితి కూడా ఏర్పడిందని రైతులు కన్నీటితో చెప్తున్నారు. గూడూరు, పొదలకూరు నిమ్మ మార్కెట్‌ల నుంచి ప్రతిరోజూ కనీసం రోజూ నలభై లారీల నిమ్మకాయలు ఎగుమతి అవుతుండేవని, ఇప్పుడు కరోనా దెబ్బతో ఆ ఎగుమతులు నిలచిపోయాయని, ఉత్తరాదికి, దక్షిణాది ప్రాంతాలకు కూడా ఎగుమతులు బాగా తగ్గిపోయాయని రైతులు చెప్తున్నారు. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఆ వచ్చే స్వల్ప ఆదాయం కాయలు కోసే కూలీలకు, లారీల బాడుగలకే చాలడం లేదని, ఎకరా తోటకు లక్షలాది రూపాయల్లో పెట్టుబడులు పెట్టినా చివరికి రాబడి వేలల్లో మాత్రమే ఉంటోందని వారు పేర్కొంటున్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com